RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in




సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 227 | పేజీలు : 08 | గురువారం | 27-08-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

# ఒలింపిక్స్‌లో తెలంగాణ సత్తా చాటేలా

కొరియా స్పోర్ట్స్ వర్సిటీతో ఒప్పందం

**ఒలింపిక్స్‌లో తెలంగాణ సత్తా చాటేలా కొరియా స్పోర్ట్స్ వర్సిటీతో ఒప్పందం**

**దక్షిణ కొరియా వెళ్లినప్పుడు కేఎన్ఎస్‌యూ బృందంతో చర్చించిన సీఎం రేవంత్‌రెడ్డి**

**పారిస్ ఒలింపిక్స్ లో కేఎన్ఎస్‌యూ అథ్లెట్లు 16 మందికి పతకాలు**

**ఒప్పందం గురించి ట్వీట్ చేసిన ముఖ్యమంత్రి రేవంత రెడ్డి**




2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

పల్లెలు, పట్టణాల నుంచి ఒలింపిక్ పోడియం వైపు ప్రయాణానికి తెలంగాణ సిద్ధమవుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇవాళ యంగ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ కొరియా నేషనల్ స్పోర్ట్ యూనివర్సిటీతో ఎంవోయూ చేసుకుంది. ఎంవోయూపై హర్షం వ్యక్తం చేస్తూ రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రపంచంలోని అత్యున్నత క్రీడా ప్రతిభ సంస్థల్లో ఒకటైన కేఎన్ఎస్‌యూతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఎంవోయూ చేసుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు.

**కేఎన్ఎస్‌యూలో శిక్షణ పొందిన అథ్లెట్లు 16 మంది ఉన్నారు**

దక్షిణ కొరియా వెళ్లినప్పుడు కేఎన్ఎస్‌యూ



## రెండు చరణాలే పాడతాం

- 'వందేమాతరం'పై కర్ణాటక సీఎం డీకే శివకుమార్ కీలక ప్రకటన
- రెండు చరణాలే పాడతామన్న సీఎం
- కాంగ్రెస్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ప్రకటన
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆరు చరణాలు ఆలపించిన వైనం
- అది తనకు తెలియకుండా జరిగిందన్న సీఎం డీకే
- ప్రతి వర్గాన్ని గౌరవించడమే కాంగ్రెస్ సిద్ధాంతమని వ్యాఖ్య

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

కర్ణాటకలో ప్రభుత్వ కార్యక్రమాల్లో 'వందేమాతరం' పూర్తి గేయాన్ని ఆలపించబోమని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ నిర్ణయం మేరకు తొలి రెండు చరణాలు మాత్రమే పాడతామని తెలిపారు. ఈ విషయంలో పార్టీ వైఖరికి తాను కట్టుబడి ఉన్నానని చెప్పారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మొత్తం ఆరు చరణాలు



## భూముల వ్యాపారంగా సాగుతోంది

- కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమంగా సాగితే.. రేవంత్ పాలన భూముల వ్యాపారంగా సాగుతోంది: హరీశ్ రావు
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందన్న హరీశ్
- పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను అమ్మేస్తున్నారని ఆరోపణ
- లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొంటున్నారని మండిపాటు

2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

నాడు కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమ కేంద్రంగా సాగితే, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పాలన భూముల వ్యాపారం కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఈరోజు ఏర్పాటు చేసిన 22ఏ బాధితుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన

## కరవు పరిస్థితులు ఉన్నా స్పందించడం లేదు

- భయంకర కరవు పరిస్థితులు ఉన్నా చంద్రబాబు ప్రభుత్వం స్పందించడం లేదు: జగన్
- డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని సవాల్ విసిరినా సమాధానం లేదన్న జగన్
- 28 జిల్లాల్లో తీవ్ర లోటు వర్షపాతం నమోదయిందని ఆందోళన
- చంద్రబాబు మాటలు నమ్మి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన



2


హైదరాబాద్ పల్స్,డెస్క్

కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ

## హిజాబ్ తీర్పు ఇస్లాంపై దాడి..

**అలహాబాద్ హైకోర్టు తీర్పుపై అసదుద్దీన్ ఒవైసీ ఫైర్**

- హిజాబ్ తీర్పుపై అలహాబాద్ హైకోర్టును తీవ్రంగా విమర్శించిన ఒవైసీ
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 19లకు విరుద్ధమని వ్యాఖ్య
- ఆరెస్సెస్, బీజేపీలకు రాజ్యాంగం కంటే మనుస్మృతే ఇష్టమని ఆరోపణ
- యూసీసీ పేరుతో హిందూ చట్టాలను ఇతర మతాలపై రుద్దుతున్నారని విమర్శ
- దేశాన్ని ప్రేమిస్తాం, కాపాడుకుంటామని స్పష్టం చేసిన ఎంఐఎం అధినేత



2

## ధరణితోనే అనేక భూ సమస్యలు..

గత ప్రభుత్వంపై వీహెచ్ ఫైర్

2 లో

## మాకు సంబంధం లేదు

- మా కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు : కొండా మురళి
- ప్రజాభవన్‌లో భట్టి, ఉత్తమ్‌తో భేటీ అయిన కొండా మురళీ
- ఇటీవల పార్టీలో జరిగిన పరిణామాలపై చర్చించినట్లు సమాచారం
- మేం కాంగ్రెస్‌ను వీడేది లేదని కొండా మురళి స్పష్టం

2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తాము కాంగ్రెస్ పార్టీని ఎట్టి పరిస్థితుల్లో వీడేది లేదని కాంగ్రెస్?నేత, మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి స్పష్టం చేశారు. తమ కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌లతో కొండా మురళి, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సమావేశం అయ్యారు. కాంగ్రెస్ అగ్రనేతలు



## బాలెన్ షాతో మాట్లాడిన మోదీ

- నేపాల్ ప్రధాని బాలెన్ షాతో మాట్లాడిన మోదీ
- మానవతాసాయం చేస్తామని హామీ నేపాల్‌లో మెరుపు వరదలు
- 105 మంది భారతీయులతో సహా 400 మంది మిస్సింగ్

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

మెరుపు వరదలతో అతలాకుతలమైన పొరుగు దేశం నేపాల్‌కు అన్ని విధాలా అండగా ఉంటామని భారత

## గల్లంతైన మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారు

మంత్రి అచ్చెన్నాయుడు

- బంగాళాఖాతంలో గల్లంతైన ఏపీ మత్స్యకారుల ఆచూకీ లభ్యం
- పశ్చిమ బెంగాల్ తీరంలో సురక్షితంగా ఉన్న ఏడుగురు జాలర్లు
- బోటులో సాంకేతిక లోపంతో తీరానికి కొట్టుకుపోయిన వైనం
- వారిని స్వస్థలాలకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వ ఏర్పాట్లు



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

బంగాళాఖాతంలో ఈ నెల ప్రారంభంలో గల్లంతైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ లభ్యమైందని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం ప్రకటించారు. వారంతా సురక్షితంగా ఉన్నారని, దీంతో వారి కుటుంబసభ్యులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఓడలరేవుకు చెందిన ఏడుగురు మత్స్యకారులు ఆగస్టు 3న సముద్రంలోకి వేటకు వెళ్లారు. షెడ్యూల్ ప్రకారం వారు ఆగస్టు 12 నాటికి తిరిగి తీరానికి చేరుకోవాల్సి ఉంది. అయితే, గడువు దాటినా వారి నుంచి ఎలాంటి సమాచారం అందకపోవడంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ

భూముల వ్యాపారంగా

# సాగుతోంది

మొదటి పేజీ రువాయి

మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో ఎక్కడ పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను విక్రయిస్తూ భావి తరాలకు కనీసం స్థలం కూడా లేకుండా చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. సామాన్య ప్రజల ఆస్తులనేమో 22ఏ నిషేధిత జాబితాలోకి నెడుతూ, ప్రభుత్వ భూములను మాత్రం ముఖ్యమంత్రి సోదరుల చేతుల్లోకి వెళ్లేలా చేస్తున్నారని విమర్శించారు. లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను పేదల వద్ద నుంచి లాక్కొని, కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ఎప్పుడు 'హైడ్రా' వచ్చి ఇళ్లను కూలుస్తుందో, ఎప్పుడు 22ఏ పేరుతో తమ భూములను గుంజుకుంటారోనని ప్రజలు భయాందోళనలతో బతుకుతున్నారని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటి ఎకరాలను, ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22ఏ జాబితాలో చేర్చిందని ఆరోపించారు. ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పుతూ... జాబితా నుంచి భూములను తొలగించడానికి 30 శాతం వరకు కమీషన్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ 22ఏ అంశంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా నిలదీస్తామని స్పష్టం చేశారు. బాధితులు ఎవరూ బ్రోకర్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని, ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పూర్తిగా తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

# రెండు చరణాలే పాడతాం

మొదటి పేజీ రువాయి

ఆలపించడంపై ప్రశ్నించగా.. తనకు తెలియకుండానే ఆ నిర్ణయం జరిగి ఉండొచ్చని శివకుమార్ అన్నారు. ఇకపై ప్రభుత్వ కార్యక్రమాల్లో మాత్రం గతంలో నిర్ణయించిన విధంగానే తొలి రెండు చరణాలు మాత్రమే పాడతామని స్పష్టం చేశారు.కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇటీవల 1937లో తీసుకున్న నిర్ణయాన్ని మరోసారి సమర్థించింది. బహిరంగ, జాతీయ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలు మాత్రమే ఆలపించాలని అప్పట్లో నిర్ణయించినట్లు పేర్కొంది. మొత్తం చరణాలు పాడాలంటూ కొత్త వందేమాతరం బిల్లు రావడం నేపథ్యంలో ఈ అంశంపై కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతోంది.కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ తప్పుబట్టింది. జాతీయ గేయాన్ని అవమానిస్తున్నారని విమర్శించింది. ఓటు బ్యాంకు రాజకీయాలకు కాంగ్రెస్ పాల్పడుతోందని ఆరోపించింది.

ఈ విమర్శలపై శివకుమార్ స్పందించారు. భారత్ భిన్న భాషలు, సంస్కృతులు, ప్రాంతాలతో కూడిన దేశమని అన్నారు. ప్రతి వర్గాన్ని గౌరవించడమే కాంగ్రెస్ సిద్ధాంతమని చెప్పారు. బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు.వందేమాతరం తరువాతి చరణాల్లో దుర్గ, లక్ష్మి, సరస్వతి వంటి హిందూ దేవతల ప్రస్తావన ఉందని కాంగ్రెస్ చెబుతోంది. ఇతర వర్గాలకు అవి అభ్యంతరకరంగా ఉండొచ్చన్న కారణంతో తొలి రెండు చరణాలకే పరిమితం కావాలని నిర్ణయించింది. కర్ణాటకలోనూ ఇదే నిర్ణయం అమలవుతుందని శివకుమార్ స్పష్టం చేశారు.

ఒలింపిక్స్‌లో తెలంగాణ

# సత్తా చాటేలా

మొదటి పేజీ రువాయి

బృందాన్ని కలిసి భాగస్వామ్యంపై చర్చించిన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీతో ఎంవోయూ తెలంగాణ క్రీడా ప్రతిభకు అథ్లెటిక్ శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్, అత్యున్నత స్థాయి విద్య విధానాలకు వారధిగా సీఎం అభివర్ణించారు. పారిస్ ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియా 31 పతకాలు సాధించగా అందులో కేఎన్ఎస్‌యూలో శిక్షణ పొందిన అథ్లెట్లు 16 మంది ఉన్నారని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. కేఎన్ఎస్‌యూ విశిష్ట సంస్కృతి రాష్ట్రానికి తీసుకురావాలనుకుంటున్నామని తెలిపారు.

**యంగ్ ఇండియా, స్పోర్టింగ్ ఇండియా**

తెలంగాణ రాష్ట్రంలో యువ అథ్లెట్లకు ప్రపంచ స్థాయి క్రీడా సామర్థ్యాలు నేర్చుకునే కొత్త అవకాశాలు సృష్టించేలా ఎంవోయూ చేసుకోవడంలో క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, అధికారులు కీలక పాత్ర పోషించారంటూ రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. మన దేశం 2036 ఒలింపిక్స్ వైపు చూస్తున్న సందర్భంలో కేవలం ఆతిథ్యం ఇవ్వడమే కాకుండా, భారత్ గర్వకారణంగా నిలిచే క్రీడాకారులను తయారు చేసేందుకు తెలంగాణ సిద్ధమవుతోందన్న సీఎం యంగ్ ఇండియా, స్పోర్టింగ్ ఇండియా అంటూ వ్యాఖ్యానించారు.

**అంతర్జాతీయ వేదికల్లో మన ప్రతిభ**

కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీతో యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం తెలంగాణ క్రీడా రంగానికి చరిత్రాత్మక ముందడుగని క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అభివర్ణించారు. ప్రపంచ స్థాయి క్రీడా శిక్షణను రాష్ట్ర క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మన ప్రతిభకు అంతర్జాతీయ వేదికలు మరింత చేరువ కానున్నాయని వివరించారు.

కరవు పరిస్థితులు ఉన్నా

# స్పందించడం లేదు

మొదటి పేజీ రువాయి

జరిపించాలని తమ పార్టీ విసిరిన సవాలుకు చంద్రబాబు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి సమాధానం లేదని ఆయన ఆరోపించారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రవ్యాప్తంగా కరవు భయంకరమైన పరిస్థితులకు దారితీసిందని, మొత్తం 28 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమతో పాటు కోస్తా ప్రాంతంలోనూ తీవ్రమైన అభద్రతా వాతావరణం నెలకొన్నా చంద్రబాబు ప్రభుత్వం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో కేవలం 52 శాతం వర్షపాతం మాత్రమే నమోదైందని, మొత్తం 688 మండలాలకు గానూ 625 మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం ఉందని వివరించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల జూన్, జులై నెలల్లో తక్కువ వర్షాలు పడతాయని తెలిసినప్పటికీ... పంటలకు నీళ్లిస్తామని ప్రభుత్వం ఆర్భాటం చేసిందని, వారి మాటలను నమ్మి ఎకరాకు రూ.15 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకవైపు వర్షాలు లేక రైతాంగం సంక్షోభంలో కూరుకుపోతుంటే, నీటి విడుదల విషయంలో చంద్రబాబు ఏమాత్రం మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాజెక్టుల పట్ల కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. శ్రీశైలం జలాశయంలో ఉన్న నీటిని కరవుతో అల్లాడుతున్న రైతులకు అందించాల్సింది పోయి... తెలంగాణతో పోటీపడి విద్యుత్ ఉత్పత్తి కోసమే వినియోగించడం దారుణమన్నారు. అవకాశమున్నా పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు నీటిని విడుదల చేయడానికి చంద్రబాబుకు మనసు ఒప్పలేదని విమర్శించారు. సెప్టెంబర్ 15 తర్వాత వర్షాలు తగ్గుముఖం పడతాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో, రానున్న రోజుల్లో రాయలసీమకు నీరు ఎలా ఇస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని నిలదీశారు.

హిజాబ్ తీర్పు

# ఇస్లాంపై దాడి..

మొదటి పేజీ రువాయి

పాఠశాల యూనిఫామ్‌తో పాటు హిజాబ్ ధరించడానికి అనుమతి కోరిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు కొట్టివేయడంపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లోని దారుస్సలాంలో జరిగిన 'జల్సా-ఎ-రహ్మతుల్-లిల్-అలమీన్' సభలో ఆయన మాట్లాడుతూ, ఈ తీర్పు ఇస్లాంపై జరిగిన దాడిగా అభివర్ణించారు.ఈ తీర్పుతో తాను ఏకీభవించనని, ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 19లను ఉల్లంఘించడమేనని ఒవైసీ అన్నారు. "ఇస్లాంలో ఏది అవసరమో, ఏది కాదో నిర్ణయించడానికి మీరెవరు? అమ్మాయిలు హిజాబ్‌ను తలపై ధరిస్తారు కానీ, మెదడుపై కాదు" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. శబరిమల కేసులో మతపరమైన ఆచారాలపై సుప్రీంకోర్టులో విచారణ ఇంకా పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు.ఈ సందర్భంగా ఆరెస్సెస్, బీజేపీలపై కూడా ఒవైసీ తీవ్ర విమర్శలు చేశారు. వారికి భారత రాజ్యాంగం కంటే మనుస్మృతే ఎక్కువ ఇష్టమని, బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని వారు మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. హిందుత్వ సిద్ధాంతకర్త సావర్కర్‌పై విమర్శలు చేస్తూ, అండమాన్ జైలులో ఆయన బ్రిటిష్ వారికి క్షమాపణ లేఖలు రాశారని, కానీ ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు మాత్రం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జిహాద్‌కు ఫత్వా జారీ చేసి, కఠిన శిక్షలు అనుభవించారని పోల్చారు. అండమాన్ జైలుకు వెళ్లిన మొదటి ఖైదీ హైదరాబాద్ మక్కా మసీదు ఇమామ్ మౌల్వీ అలావుద్దీన్ అని పేర్కొన్నారు.ఉత్తరాఖండ్, అసోం, గుజరాత్‌లలో అమలు చేస్తున్న యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ)పై కూడా ఒవైసీ స్పందించారు. హిందూ వివాహ, విడాకులు, వారసత్వ చట్టాల ఆధారంగా రూపొందించిన చట్టాలను యూసీసీ అని ఎలా అంటారని, వాటిని ముస్లింలపై ఎందుకు రుద్దాలని ప్రశ్నించారు. తమను తమ మతం నుంచి దూరం చేయాలని చేసే ప్రయత్నాలు ఫలించవని, తాము ఖురాన్‌ను అనుసరిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. తాము ఈ దేశాన్ని ప్రేమిస్తామని, దేశాన్ని కాపాడుకుంటూనే భారత్‌ను సూపర్ పవర్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని ఒవైసీ పేర్కొన్నారు.

# మాకు సంబంధం లేదు

మొదటి పేజీ రువాయి

సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకపై తమకు విశ్వాసం ఉందన్న కొండా మురళి కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఏమీ మాట్లాడనని కొండా మురళి తెలిపారు.

**సుస్మిత ప్లాన్-బి ఏమిటో తెలియదు**

ప్రజా భవన్‌లో జరిగిన భేటీలో కొండా సురేఖ అంశం, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించలేదని తెలిపారు. కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని, ఆమె ప్లాన్-ఎ ప్రకారం వ్యాఖ్యలు చేసిందని, ప్లాన్-బి ఏమిటో తనకు తెలియదన్నారు. మంత్రి సురేఖ మంగళవారం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారని, నేడు కూడా మరో కార్యక్రమానికి హాజరయ్యారని గుర్తు చేశారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఏమీ మాట్లాడనని వెల్లడించారు.

**అందుకోసమే వచ్చాను**

ఈ సమావేశంలో పాల్గొన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన నియోజకవర్గ బిల్లుల కోసమే భట్టి విక్రమార్కని కలిశానని తెలిపారు. అప్పటికే ప్రజాభవన్‌లో కొండా మురళి ఉన్నారని పేర్కొన్నారు. మరోవైపు ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్కతో కొండా మురళి, రాజగోపాల్‌రెడ్డి సమావేశమైన సమయంలోనే ప్రజాభవన్‌కు వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా భేటీలో పాల్గొన్నారు. తరువాత సమావేశం నుంచి కొండా మురళి అర్ధంతరంగా వెళ్లిపోయారు.

బాలెన్ షాతో

# మాట్లాడిన మోదీ

మొదటి పేజీ రువాయి

ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చారు. వరద ప్రభావిత నేపాల్‌కు సాధ్యమైనంత మానవతాసాయం, సహాయక చర్యలను అందిస్తామని స్పష్టం చేశారు. నేపాల్ ప్రధాని బలెన్ షాతో ఫోన్‌లో మాట్లాడిన మోదీ, ఈ కష్టకాలంలో భారత ప్రజలు నేపాల్ సోదరసోదరీమణులకు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. వరద బీభత్సంతో జరిగిన ప్రాణనష్టం పట్ల ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు.

బుధవారం ఉదయం స్థానిక కాలమానం ప్రకారం 9 గంటల ప్రాంతంలో వచ్చిన ఈ ఆకస్మిక వరద వల్ల రసువా, ధాడింగ్ జిల్లాల్లోని నదీ పరీవాహక ప్రాంతాల్లో తీవ్ర విధ్వంసం చోటుచేసుకుంది. మెరుపు వరదల్లో 384 మంది ప్రయాణికులు గల్లంతైనట్లు నేపాల్ టూరిజం బోర్డు వెల్లడించింది. వీరిలో 291 మంది విదేశీయులు కాగా, 93 మంది నేపాల్ పౌరులు ఉన్నారు. గల్లంతైన విదేశీయుల్లో అత్యధికంగా 105 మంది భారతీయ పర్యాటకులు, 37 మంది ఎన్నారైలు ఉన్నట్లు పేర్కొంది. వీరితో పాటు అమెరికా, బ్రిటన్, మలేసియా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్‌కు చెందిన పర్యాటకులు కూడా వరదల్లో చిక్కుకుపోయినట్లు గుర్తించారు. బాధితులు, పర్యాటకుల సమాచారం కోసం నేపాల్ టూరిజం బోర్డు ప్రత్యేక సహాయక నంబర్లను అందుబాటులోకి తెచ్చింది.

ధరణితోనే అనేక

# భూ సమస్యలు..

మొదటి పేజీ రువాయి

హైదరాబాద్, ఆగస్టు 26: గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రభుత్వ సలహాదారుడు వి.హనుమంతరావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం గాంధీభవన్‌లో ప్రజలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో వీహెచ్ పాల్గొన్నారు. ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రగతి భవన్‌ను కట్టి ప్రజల సమస్యలను చెప్పుకోవడానికి అవకాశాలు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చి ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా మార్చారని తెలిపారు. గాంధీభవన్ కూడా ప్రజల సమస్యల పరిష్కార వేదిక అయ్యేలా ముఖాముఖీ కార్యక్రమం చేపట్టారని చెప్పారు.

**ఆ భూములపై అక్రమ రిజిస్ట్రేషన్లు**

ఈరోజు ముఖాముఖి కార్యక్రమంలో.. భూములకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా తన దృష్టికి వచ్చినట్లు వీహెచ్ తెలిపారు. పటేల్ పట్వారి విధానం వల్ల భూ సమస్యలు తక్కువగా ఉండేవన్నారు. గత ప్రభుత్వం.. ధరణితో పాటు అనేక సమస్యలు తీసుకొచ్చిందని వ్యాఖ్యానించారు. నాడు ఇందిరా గాంధీ పంచిన భూములను మళ్లీ భూస్వాములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆఫీసులో తప్పిదాలు జరుగుతున్నాయని.. రెవెన్యూ శాఖ మంత్రి పటిష్ట చర్యలు తీసుకోవాలని వి.హనుమంతరావు సూచించారు.

**వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు వ్యతిరేకం..**

వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో నరేంద్ర మోదీ నాలుగోసారి ప్రధాని అవ్వాలని చూస్తున్నారని వీహెచ్ అన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ అమెరికాలో సాధ్యమని.. భారత దేశంలో కాదన్నారు. ప్రధాని మోదీకి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు సంబంధాలు ఉన్నాయని.. అందుకే భారత్‌ను అమెరికాలా చేయాలని మోదీ చూస్తున్నారని అన్నారు. భారత్ సెక్యులర్ దేశమని.. ఇక్కడ వన్ నేషన్ వన్ ఎలక్షన్ సాధ్యం కాదని చెప్పారు. భారత దేశంలో భిన్న మతాలు, భిన్న కులాల ఉన్నాయన్నారు. కేంద్రం చేస్తున్న క్యాస్ట్ సెన్స్, కులగణనలో బీసీల కాలమే లేదని తెలిపారు. అలాంటిది వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఎక్కడిదని ప్రశ్నించారు. 70 శాతం ఉన్న బీసీలకు అన్యాయం చేస్తారా అంటూ నిలదీశారు. ముందు బీసీల సంగతి తేల్చాలన్నారు. 'మేము వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు వ్యతిరేకం' అని స్పష్టం చేశారు. కులగణన పేరుతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న ఓట్లకు, ఈసీ లెక్కలకు తేడా ఉందని వీహెచ్ పేర్కొన్నారు.

# గల్లంతైన మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారు

మొదటి పేజీ రువాయి



విషయం ప్రభుత్వ దృష్టికి రావడంతో వెంటనే గాలింపు చర్యలు ప్రారంభమయ్యాయి.మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించిన వివరాల ప్రకారం, మత్స్యకారులు ప్రయాణిస్తున్న బోటులో సాంకేతిక లోపం తలెత్తడంతో అది పశ్చిమ బెంగాల్ తీరానికి కొట్టుకుపోయింది. అక్కడి అధికారుల ద్వారా సమాచారం అందుకున్న ఏపీ అధికారులు, బోటు యజమాని సోదరుడైన భవానీ ప్రసాద్‌తో మాట్లాడి మత్స్యకారులంతా క్షేమంగా ఉన్నట్లు ధ్రువీకరించుకున్నారు. వారిని సురక్షితంగా స్వస్థలాలకు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని, అధికారుల బృందాన్ని వెంటనే పశ్చిమ బెంగాల్‌కు పంపాలని మంత్రి ఆదేశించారు.మత్స్యకారుల ఆచూకీ కోసం ప్రభుత్వం విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇండియన్ కోస్ట్ గార్డ్, నౌకాదళం, ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ గాలింపు జరిపారు. మంగళవారం నాడు ఆపరేషన్‌ను మరింత ముమ్మరం చేసి, 15 కోస్ట్ గార్డ్ నౌకలు, నాలుగు హెలికాప్టర్లను రంగంలోకి దించారు. కోల్‌కతాలోని ఈస్టర్న్, నార్త్-ఈస్టర్న్ కమాండ్‌లను అప్రమత్తం చేయడంతో పాటు, మెరైన్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ (వీ=జజ) పర్యవేక్షణలో ఎలక్ట్రానిక్ నిఘా కూడా కొనసాగించారు. అవసరమైతే సమాచారం లభించవచ్చనే ఉద్దేశంతో పొరుగు దేశాలైన మయన్మార్, బంగ్లాదేశ్ సముద్రయాన అధికారులను కూడా అప్రమత్తం చేశారు.ప్రభుత్వ యంత్రాంగం సమష్టి కృషితోనే మత్స్యకారుల ఆచూకీని కనిపెట్టగలిగామని, ఈ ఆపరేషన్‌లో పాలుపంచుకున్న జిల్లా కలెక్టర్, కమిషనర్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, కోస్ట్ గార్డ్ సిబ్బందిని మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు.

# గిరిజనుల ఐక్యత, సంస్కృతికి ప్రతిబింబం తీజ్ పండుగ

## గిరిజనుల ఆచార సంప్రదాయాలను భావితరాలకు అందించాలి: గంగాధర్ రెడ్డి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, శేరిలింగంపల్లి, ఆగస్టు 26:** గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అన్నారు. మైసిగండిలో గిరిజనులు నిర్వహించిన తీజ్ పండుగ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై గిరిజనులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ.. పెళ్లికాని గిరిజన యువతులు తీజ్ పండుగ సందర్భంగా భక్తిశ్రద్ధలతో తమ ఆరాధ్య దైవాలను పూజించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. మంచి వరుడు లభించి త్వరగా వివాహం జరగాలని కోరుకోవడం ఈ పండుగలోని ప్రత్యేక సంప్రదాయమని తెలిపారు. తీజ్ పండుగ కేవలం వేడుక మాత్రమే కాదని, గిరిజనుల జీవన విధానం, విశ్వాసాలు, ఆచార సంప్రదాయాలు, ఐక్యతకు ప్రతిబింబమని పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి వాటి గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గిరిజనుల సంక్షేమం, హక్కులు, అభివృద్ధితో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన సమాజ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల ప్రతినిధులు, నాయకులు శ్రీరాములు, తులసీరామ్,



అర్జున్, ప్రకాష్, రంగస్వామి, గోవర్ధన్, రవీంద్ర, రాజు, గోపాల్, పరమేశ్, టీకీలాల్, శారద, నందిని, ఇందు తదితరులతో పాటు స్థానిక నాయకులు, ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ ఆరుట్ల రామచంద్రారెడ్డి 41వ వర్ధంతి

## ఘనంగా నిర్వహించిన కమ్యూనిస్టు శ్రేణులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ఆరుట్ల రామచంద్రారెడ్డి 41వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ గౌడ్,లు మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ ఆరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి విగ్రహాలను ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుల



జీవిత చరిత్రను పాఠ్యాంశా పుస్తకాల్లో చేర్చాలని ఆయనే ప్రభుత్వాన్ని కోరారు. కొలనుపాక లోని ప్రభుత్వ స్థలంలో నిరుపేద కుటుంబాలకు ఇండ్ల ప్లాట్లు ఇచ్చి, ఇందిరమ్మ ఇల్లు, మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల కమలాదేవి రామచంద్రారెడ్డి ఫౌండేషన్ చైర్మన్ ఆరుట్ల సుశీలా దేవి, గ్రామ సర్పంచ్ బెదరబోయిన యాకమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్, ఆలేరు మండల ప్రధాన కార్యదర్శి కనుకయ్య, కొలనుపాక గ్రామ కార్యదర్శి పోన్నబోయిన రవి, గోద శ్రీరాములు, పోతు ప్రవీణ్, కళ్లెం కృష్ణ, రాజయ్య, ఆరుట్ల మమత, తుంగ కుమార్, పాలవాయి మాధవరెడ్డి, పేరపు రాములు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మీలాద్ ఉన్ నబి వేడుకలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో జలీల్ పుర మజీద్ కమిటీ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుక ఈద్ మిలాద్-ఉన్-నబీ సందర్భంగా భక్తి గీతాలు శాంతి సందేశాన్ని అందిస్తూ భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీ జలీల్ పుర మసీదు నుండి ప్రారంభమై సమద్ చౌరస్తా, కుమ్మరి వాడ, నల్గొండ రోడ్డు మీదుగా అంబేద్కర్ చౌరస్తా నుండి జలీల్ పుర వరకు కొనసాగింది. ర్యాలీలో చిన్న పిల్లలతో సహా వృద్ధులు పాల్గొని నారే తక్ బీర్ అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ప్రిన్స్ కార్నర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సభ ప్రాంగణంలో ప్రముఖ న్యాయవాది అబ్దుల్ రహీం అడ్వకేట్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ అవేస్ చిస్తీ, మస్జీద్ కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్ చౌదరి మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త ప్రపంచ మానవులకి శాంతి సందేశాన్ని ఇచ్చారని, ఇస్లాం అనేది శాంతి అని అ నాడు మొహమ్మద్ ప్రవక్త చెప్పారని ఇస్లాం మతం కాదని శాంతి సందేశం అని వారు ఈ సందర్భంగా అన్నారు.



ప్రతి పౌరుడు శాంతి ద్వారా మతాలకు అతీతంగా కలిసిమెలిసి జీవించాలని మహమ్మద్ ప్రవక్త సూత్రాలను ప్రతి పౌరుడు పాటించాలని ప్రవక్త సన్మార్గంలో నడవాలని ప్రపంచ మానవులకి మహమ్మద్ ప్రవక్త ఆదర్శమని అన్నారు. యువత వారి అడుగుజాడల్లో ప్రయాణించాలని వారు కోరారు. ఈ రోజుల్లో మానవనియత విలువలు కనుమరుగు అయింది అని. మానవ విలువలను కాపాడి ప్రపంచ శాంతికి తోడ్పాటు అందించే విధంగా అందరూ జీవించాలని వారు కోరారు. అదేవిధంగా పోలీస్ శాఖ వారి నుండి ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినందుకు టౌన్ సిఐ రమేష్ ని మరియు ఇతర పోలీసు అధికారులను సన్మానించడం జరిగింది, ఈ



కార్యక్రమంలో కౌన్సిలర్ బుర్హాన్, బట్టు రామచంద్రయ్య, గౌరవాధ్యక్షుడు ముష్టక్ చౌదరి, ఉపాధ్యక్షుడు ముస్తఫా ఖాద్రి, షకీల్, కార్యదర్శి కాజం అహ్మద్, జాయింట్ సెక్రెటరీ ఇక్బాల్ అహ్మద్, గఫర్ చౌదరి, సాదిక్ అలీ, సలవుద్దీన్, అమీరుద్దీన్, కోశాధికారి రహీముద్దీన్, ఉస్మాన్,జర్నలిస్ట్ షానూర్ బాబా, జర్నలిస్ట్ ఇంతియాజ్,జర్నలిస్ట్ సుజావద్దీన్, ఫహీం, గౌస్, టూఫీక్, ఖాదర్, సైపులహా, అఫ్రోజ్, ఇల్యాస్,సమీర్, జలీల్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరేందుకు షాద్‌నగర్ జిల్లా పోరాట సమితి అంగీకారం

## పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యలపై విస్తృత చర్చ.. త్వరలో అధికారిక చేరిక




**హైదరాబాద్ పల్స్ న్యూస్, శేర్లింగంపల్లి, ఆగస్టు 26:** షాద్‌నగర్ జిల్లా పోరాట సమితి నాయకులు, సభ్యులు తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరేందుకు అంగీకరించారు. ఈ మేరకు మంగళవారం రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో షాద్‌నగర్ జిల్లా పోరాట సమితి అధ్యక్షుడు సంతోష్, కుందుర్తి మండల తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై పోరాటాలు, సంస్థాగత బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. చర్చలు సఫలమవడంతో పోరాట సమితి నాయకులు, సభ్యులు పార్టీలో చేరేందుకు అంగీకరించినట్లు తెలిపారు. త్వరలో అధికారికంగా పార్టీలో చేరనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ బండారి రమేష్ యాదవ్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు నర్సింగ్ ముదిరాజ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బండారు విజయలక్ష్మి, జిల్లా కార్యదర్శి పద్మ, శేర్లింగంపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# దోమల నిర్మూలనకు గ్రామంలో క్రిమిసంహారక మందు పిచికారీ

## సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, కోహీర్, ఆగస్టు 26:** వర్షాకాలంలో దోమలు, క్రిమికీటకాల బెడద పెరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కోహీర్ మండలం గురుజువాడ గ్రామంలో క్రిమిసంహారక మందు పిచికారీ కార్యక్రమాన్ని చేపట్టారు. సర్పంచ్ ప్రియాంక రాజేందర్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధులు, మురుగు కాలువలు, కాలనీ ప్రాంతాలు, నీరు నిల్వ ఉండే ప్రదేశాలు, రద్దీ ప్రాంతాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రియాంక రాజేందర్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇళ్ల చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ దోమల నివారణకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# సంక్షేమ పథకాలతో బీజేపీ రాజకీయ వ్యూహం.. నగదు బదిలీపై కొత్త చర్చ

## మహిళలు, రైతులు, యువతను లక్ష్యంగా పథకాలు.. నేరుగా ఖాతాల్లో నగదు జమ

**హైదరాబాద్ పల్స్ న్యూస్,న్యూఢిల్లీ, ఆగస్టు 26:**
దేశ రాజకీయాల్లో సంక్షేమ పథకాలు, నేరుగా నగదు బదిలీ పథకాలు కీలకంగా మారుతున్నాయి. భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న పలు రాష్ట్రాల్లో మహిళలు, రైతులు, యువతను లక్ష్యంగా చేసుకుని ఆర్థిక సహాయ పథకాలు అమలు చేస్తున్న నేపథ్యంలో.. వీటి రాజకీయ ప్రభావంపై చర్చ జరుగుతోంది.

**మహిళలకు ఆర్థిక సహాయం**

మహిళలను లక్ష్యంగా చేసుకుని పలు రాష్ట్ర ప్రభుత్వాలు నెలవారీ లేదా వార్షిక ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లో 'లాడ్లీ బహనా' పథకం, మహారాష్ట్రలో 'మాఝీ లడ్కీ బహిన్' పథకం, ఒడిశాలో 'సుభద్ర' పథకం వంటి కార్యక్రమాల ద్వారా మహిళల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నారు.

**రైతులకు పెట్టుబడి సాయం**

రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా అర్హులైన రైతులకు ఏడాదికి రూ.6 వేల ఆర్థిక సహాయం అందుతోంది. కొన్ని రాష్ట్రాలు దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రైతులకు ఆర్థిక సహాయం అందిస్తున్నాయి.

**యువతకు ప్రోత్సాహం**

విద్యార్థులు, యువత కోసం కూడా పలు రాష్ట్రాల్లో ఉపకార వేతనాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు అమలవుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థినులకు ఆర్థిక సహాయం అందించే పథకాలు కొన్ని రాష్ట్రాల్లో కొనసాగుతున్నాయి.

**'రేవ్డీ' విమర్శలపై రాజకీయ చర్చ**

ఎన్నికల సమయంలో ఉచిత పథకాలపై రాజకీయ పార్టీల మధ్య తీవ్ర చర్చ జరుగుతోంది. ప్రతిపక్షాలు ప్రకటించే ఉచిత పథకాలను 'రేవ్డీ సంస్కృతి'గా విమర్శించే బీజేపీ.. తన ప్రభుత్వాల సంక్షేమ పథకాలను మాత్రం పేదలు, మహిళలు, రైతుల సాధికారతకు ఉపయోగపడే కార్యక్రమాలుగా వివరిస్తోంది. ఇళ్ల నిర్మాణం, వంటగ్యాస్ కనెక్షన్లు, బ్యాంకు ఖాతాల ఏర్పాటు వంటి కార్యక్రమాలను శాశ్వత ప్రయోజనాలను కల్పించే చర్యలుగా కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకులు పేర్కొంటున్నారు.

**రైతుబంధు తర్వాత పీఎం కిసాన్**

తెలంగాణలో గత ప్రభుత్వం 2018లో ప్రారంభించిన 'రైతుబంధు' పథకం దేశవ్యాప్తంగా రైతులకు పెట్టుబడి సాయం అందించే పథకాలపై చర్చకు దారితీసింది. అనంతరం కేంద్ర ప్రభుత్వం 2019లో 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి'ని ప్రారంభించింది. అయితే పీఎం కిసాన్ పథకం నేరుగా రైతుబంధు పథకాన్ని అనుకరించిందేనన్న వాదన రాజకీయంగా వినిపిస్తున్నప్పటికీ, దీనిని కేవలం ఒకే పథకం ప్రభావంగా నిర్ధారించడానికి ఆధారాలు అవసరమని నిపుణులు చెబుతున్నారు.



**నేరుగా ఖాతాల్లోకి నగదు**

జన్‌ధన్ ఖాతాలు, ఆధార్, మొబైల్ అనుసంధానంతో కూడిన వ్యవస్థ ద్వారా సంక్షేమ ప్రయోజనాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి బదిలీ చేసే విధానం విస్తరించింది. మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించడం, ప్రభుత్వ సహాయాన్ని నేరుగా అందించడం ఈ విధానంలోని ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం పేర్కొంటోంది. ఎన్నికల రాజకీయాల్లో సంక్షేమ పథకాల పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో.. నగదు బదిలీ పథకాలు నిజంగా సాధికారతకు దోహదం చేస్తున్నాయా? లేక ఓటర్లను ఆకర్షించే రాజకీయ వ్యూహంగా మారుతున్నాయా? అనే అంశంపై దేశవ్యాప్తంగా చర్చ కొనసాగుతోంది.

## పాల్ఘర్‌లో మత మార్పిడి కలకలం..

# 22 మంది మహిళలపై ఎఫ్ఐఆర్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మహారాష్ట్ర, ఆగస్టు 26:** ఆర్గనైజర్ కథనం ప్రకారం : మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో మత మార్పిడికి ప్రయత్నించారనే ఆరోపణలపై 22 మంది మహిళలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మోఖాడా పోలీస్ స్టేషన్ పరిధిలోని వకాడ్‌పాడా గ్రామంలో ఆగస్టు 21న ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. 18 ఏళ్ల విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఫిర్యాదు ప్రకారం.. కొందరు మహిళలు విద్యార్థి ఇంటికి వెళ్లి క్రైస్తవ మతానికి సంబంధించిన పుస్తకాలను ఉచితంగా అందించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. వాటిని చదివితే అనారోగ్యాలు నయమవుతాయని, వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యార్థి పుస్తకాలను స్వీకరించేందుకు నిరాకరించిన అనంతరం హిందూ




దేవతలు, మత విశ్వాసాలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి క్రైస్తవ మతాన్ని స్వీకరించాలని కోరినట్లు ఆరోపణలు వచ్చాయి. విద్యార్థి గ్రామస్థులకు సమాచారం ఇవ్వడంతో వారు మహిళలను అడ్డుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రాథమిక దర్యాప్తులో మహిళలు హైదరాబాద్ నుంచి స్థానికంగా ఉన్న ఒక మహిళ పరిచయాల ద్వారా వచ్చినట్లు గుర్తించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో భారతీయ న్యాయ సంహితలోని 299, 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు మోఖాడా పోలీస్ స్టేషన్ సహాయ పోలీసు ఇన్‌స్పెక్టర్ అజిత్ సాబ్లే తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని పోలీసులు వెల్లడించారు.

## మోహన్ భగవత్ అమెరికా

# పర్యటన రద్దు చేయడం సరికాదు: కేఏ పాల్

### అమెరికాలో అందరికీ సమాన న్యాయం ఉండాలి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మెయిన్ డెస్క్, ఆగస్టు 26:** ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అమెరికా పర్యటనపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ స్పందించారు. ప్రజాస్వామ్య దేశంలో మోహన్ భగవత్ పర్యటనను రద్దు చేయడం సరికాదని ఆయన వ్యాఖ్యానించారు. మోహన్ భగవత్ అమెరికా పర్యటనకు ముందు క్రైస్తవ, ముస్లిం, సిక్కు సంస్థలు ఆయన వీసాను రద్దు చేయాలని అమెరికా ప్రభుత్వానికి, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఫిర్యాదు చేసినట్లు తనకు



సమాచారం ఉందని కేఏ పాల్ తెలిపారు. అమెరికాలోని కొందరు నాయకులు తన అభిప్రాయాన్ని కూడా కోరినట్లు చెప్పారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, సమాన న్యాయం ఉండాలని తాను వారికి సూచించినట్లు కేఏ పాల్ పేర్కొన్నారు. ఒకరి పర్యటనను రద్దు చేస్తే, ఇతర మతాలకు చెందిన వ్యక్తుల పర్యటనల విషయంలోనూ అదే విధానం పాటించాల్సి ఉంటుందని అన్నారు. ఆగస్టు 29న మోహన్ భగవత్ తన ప్రసంగంలో దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడతామని, మణిపూర్ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని, అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటామని చెప్పాలని కేఏ పాల్ కోరారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు శాంతియుతంగా ఉండాలని, అన్ని వర్గాల వారు పరస్పరం కలిసిమెలిసి జీవించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అమీన్‌పూర్‌లో 22/ఏ నిషేధిత జాబితాపై ఆందోళన

### పాత ఇళ్లు, నివాస స్థలాలను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, అమీన్‌పూర్, ఆగస్టు 26:** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో పాత ఇళ్లు, నివాస స్థలాలకు సంబంధించిన వందలాది సర్వే నంబర్లను 22/ఏ నిషేధిత జాబితాలో చేర్చారంటూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో సంబంధిత సమస్యపై అధికారులకు వినతిపత్రం సమర్పించి, నిషేధిత జాబితాలో చేర్చిన భూములను పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. 993/20, 993/24, 993/47/అ, 152/అ, 993/45/అ, 993/44, 343/6-3, 550/అ, 343/1, 103/అ1 తదితర 56కు పైగా సర్వే నంబర్లు ప్రభావితమయ్యాయని నాయకులు తెలిపారు. ఈ వ్యవహారం వల్ల 10కుపైగా కాలనీలకు చెందిన సుమారు 400 కుటుంబాల భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతి సర్వే నంబరును క్షేత్రస్థాయిలో పరిశీలించి, రిజిస్ట్రేషన్ పత్రాలు, పట్టా పత్రాలు, పన్ను రసీదులు తదితర ఆధారాలను పరిశీలించాలని వారు కోరారు. నిబంధనలకు విరుద్ధంగా 22/ఏ జాబితాలో చేర్చిన భూములను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

**29న భారీ ధర్నాకు పిలుపు**

సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారం



చూపకపోతే ఆగస్టు 29న అమీన్‌పూర్‌లో భారీ ధర్నా నిర్వహిస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. బాధిత కుటుంబాలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

# భూకంపం వచ్చిందా? నేపాల్ జల విలయానికి కారణం ఇదేనా?

పొరుగు దేశం నేపాల్‌లో ప్రకృతి బీభత్సం సృష్టించింది. టిబెట్ సరిహద్దుకు సమీపంలో ఆకస్మిక వరదలు పోటెత్తాయి. రసువా జిల్లాలోని భోటేకోశీ నదిలో సంభవించిన ఈ జల ప్రళయంలో ఇప్పటివరకు 22 మంది ప్రాణాలు కోల్పోగా, 105 మంది భారతీయులతో సహా దాదాపు 348 మంది గల్లంతయ్యారు. ఈ ఘటనతో రసువాతో పాటు ధాదింగ్, నువాకోట్ జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఆకస్మిక వరదల్లో అనేక గ్రామాలు, వంతెనలు, రోడ్లు, జలవిద్యుత్ ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. బురద, శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోయారు. గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు, 93 మంది నేపాల్ పౌరులు, 12 మంది బ్రిటిష్, ముగ్గురు అమెరికన్ పౌరులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.



**భూకంపమే కారణమా?**

ఈ దుర్ఘటనకు భూకంపం ప్రేరేపిత కొండచరియలే కారణమని నేపాల్ విదేశాంగ మంత్రి షిషిర్ ఖనాల్ పార్లమెంటుకు వివరించారు. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 8:30 గంటల సమయంలో టిబెట్ భూభాగంలో 4.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు యూఎస్ జియలాజికల్ సర్వే (ఖూ+ూ) నమోదు చేసింది. ఈ భూకంపం ధాటికి భారీగా మంచు, రాళ్లతో కూడిన కొండచరియలు విరిగిపడి టిబెట్ వైపు ఉన్న లెండే ఖోలా నది ప్రవాహానికి అడ్డుపడ్డాయి. దీంతో తొలుత నీరు భారీగా నిలిచిపోయింది. ఆ ప్రవాహం అంతకంతకు అధికం కావడంతో, ఆ అడ్డుకట్ట ఒక్కసారిగా తెగిపోయింది. దాంతో భోటేకోశీ నదిలోకి వరద పోటెత్తిందని ప్రాథమికంగా నిర్ధారించారు.

**సహాయక చర్యలు.. భారత్ అండ**

నేపాల్ సైన్యం, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. అయితే, వరద ఉద్ధృతి తగ్గకపోవడంతో హెలికాప్టర్లు దిగలేని పరిస్థితి నెలకొంది. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నారు. ఈ ఘటనపై భారత ప్రధాని నరేంద్ర మోదీ, నేపాల్ ప్రధాని బాలెన్ షాతో ఫోన్‌లో మాట్లాడి సంతాపం తెలిపారు. అన్ని రకాల మానవతా సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. నిత్యావసరాలు, మందులతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపే అంశాన్ని భారత్ పరిశీలిస్తోంది. మరోవైపు, చైనా కూడా సరిహద్దుల్లో సహాయక బృందాలను మోహరించింది. కాగా, నది ఎగువన ఇంకా అవరోధాలు ఉండటంతో మరోసారి వరద వచ్చే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీహార్, ఉత్తరప్రదేశ్ వంటి భారత సరిహద్దు రాష్ట్రాల్లోనూ వరద హెచ్చరికలు జారీ చేశారు.

# యువత గంజాయి మత్తుకు దూరంగా ఉండేలా పోలీసుల తనిఖీలు

### చినేగేపల్లి, గణేశ్‌పూర్ గ్రామాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, న్యాల్కల్, ఆగస్టు 26:** యువత గంజాయి మత్తుకు బానిస కాకుండా అరికట్టే చర్యల్లో భాగంగా హద్నూర్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. సంగారెడ్డి నుంచి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి చినేగేపల్లి, గణేశ్‌పూర్ గ్రామాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గ్రామాల్లో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని హద్నూర్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు, సమాచారం అందించిన వారికి ఎస్ఐ ప్రశంసలు అందజేస్తారని తెలిపారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని హద్నూర్ ఎస్ఐ కోరారు.



# ఘనంగా శ్రీ వెంకటేశ్వరస్వామి తిరు కళ్యాణ మహోత్సవం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాధపురం కోరిన కోరికలు తీర్చే శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం, బుధవారం త్రయోదశి పర్వదినాన్ని పుస్కరించుకుని శ్రీ స్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రభాతవేళ శ్రీ స్వామి వారి మూలమూర్తికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు ఆలయ అర్చకులు శ్రీమాన్ చక్రవర్తుల శ్రీనివాస చార్యులు వేదమంత్రోత్సనులతో ఘనంగా నిర్వహించారు, అనంతరం నూతన వస్త్రాలతో పూలమాలలతో దివ్య మనోహరంగా శోభాయ మానంగా అలంకరించి శ్రీ స్వామి వారికి అమ్మ వార్ల కు సహస్ర నామార్చన, అష్టోత్తర శతనామార్చనలు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు, అనంతరం శ్రీ స్వామివారి మాస నక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి, తిరు కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు శ్రీమాన్ చక్రవర్తుల శ్రీనివాసచార్యులు ఆచార్యులు అత్యంత వైభవపేతంగా ఘనంగా నిర్వహించారు ,ఈ కళ్యాణ మహోత్సవంలో కళ్యాణ కర్తలుగా ఆలయ దాతలు హైదరాబాద్ వాస్తవ్యులు బొమ్మ గణేష్ సతీ సమేతగా కుటుంబ సభ్యులతో పాల్గొని శ్రీ స్వామి వారికి అమ్మవార్లకు, పట్టు వస్త్రాలు సమర్పణ చేశారు, కళ్యాణం అనంతరం నైవేద్య నివేదనలు భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు,ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# అనితను పరామర్శించిన మాజీ జడ్పీ చైర్మన్

### అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి మనోధైర్యం కల్పించిన సత్యనారాయణ గౌడ్



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 26, నర్సింహులపేట:** నర్సింహులపేట మండలం నర్సింహాపురం బంజర శివారు లలితండాకు చెందిన గుగులోత్ శంకర్ కుమార్తె అనితను ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ మెరుగు సత్యనారాయణ గౌడ్ బుధవారం పరామర్శించారు. అనిత ఇటీవల హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా రెండు కిడ్నీలు విఫలమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స అనంతరం ఆమె స్వగృహానికి చేరుకున్న విషయం తెలుసుకున్న సత్యనారాయణ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనిత కుటుంబ సభ్యులు మనోధైర్యాన్ని కోల్పోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో రవి నాయక్, కేతయ్య, బలరాం, రామోజీ, శంకర్ తదితర తండావాసులు పాల్గొన్నారు.

## ఏడో వార్డు అభివృద్ధే ధ్యేయం నాగబండి మధుసూదన్ గుప్తా



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామంలోని ఏడో వార్డు అభివృద్ధి ధ్యేయంగా ఆలేరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొలనుపాక ఏడవ వార్డు అభివృద్ధి ప్రదాత నాగబండి మధుసూదన్ గుప్తా రాబోయే రాఖీ పండుగ సందర్భంగా ఏడవ వార్డు ప్రజలకు రాఖీలు, స్వీట్లను పంపిణీ చేసి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగబండి మధుసూదన్ గుప్తా మాట్లాడుతూ... ఏడవ వార్డు అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తానని ఆయన అన్నారు. వాటర్ సమస్యలు, మోరీలు, సీసీ రోడ్లు ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని వార్డు ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంకం సంపత్, పుల్లె రవి, సుధాకర్, చరణ్, నిర్మల, కవిత, శ్రీవాణి, బాలమణి, శారద, వల్లాల లక్ష్మి, బాదిని విజయ, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## తుర్కపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా పెండెం రవి





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండల కేంద్రంలో బుధవారం రోజు ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సమావేశంలో తుర్కపల్లి మండలం ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా మండల కేంద్రానికి చెందిన పెండెం రవి (వార్త రిపోర్టర్) ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఆరే, నర్సింహులు (నవ తెలంగాణ) ఉపాధ్యక్షులుగా, అక్కారం కృష్ణ, కొండం నాగరాజు, ఆకుల శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొలనుపాక కొండల్ (కనకరాజు-ప్రజాపక్షం) ప్రధాన కార్యదర్శి పులిగిల్ల స్వామి (ఆంధ్ర ప్రభ) కోశాధికారి ఎం.డి.చాంద్ పాషా, సహాయ కార్యదర్శులు గడిపె ఇంద్రయ్య, ఆకుల రాజుకుమార్. గౌరవ సలహాదారులు షేక్ బురాన్, ప్రచార కార్యదర్శిగా పుట్ట అంజనేయులు, సంయుక్త కార్యదర్శులుగా తునికి శ్రీనివాస్, కర్రె ఉపేందర్ గౌడ్, ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పెండెం రవి మాట్లాడుతూ... విలేకరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, మండల ప్రజల సమస్యలను ప్రభుత్వాలు, అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు ఆదిమూలం సురేష్, బేతాల బాబు, ఆకుల నవీన్, పుట్ట కార్తీక్, కొత్తింటి సురేష్, సుంకి శివ లను ఎన్నుకున్నారు.

## నాంపల్లిలో ఫీజుల బకాయిలపై బీజేపీ లడాయి దీక్ష

### దీక్షకు మద్దతుగా పాల్గొన్న కొంపల్లి బీజేపీ నాయకులు






**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 26, నాంపల్లి:** తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు సంబంధించిన రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఫీజుల బకాయి-బీజేపీ లడాయి' నిరాహార దీక్ష కొనసాగింది.రెండో రోజు దీక్ష సందర్భంగా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసినట్లు పార్టీ నాయకులు తెలిపారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి సూచన మేరకు ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి రాజిరెడ్డితో కలిసి బీజేపీ కొంపల్లి డివిజన్ అధ్యక్షుడు పెద్దబుద్ధుల సతీష్ సాగర్ దీక్ష కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బీజేపీ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి బీజేపీ నాయకులు శివాజీ రాజు, కొండల్ రెడ్డి, మధు, మహేందర్ సాగర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్తాన్ ఆసుపత్రిలో ఘోర అగ్నిప్రమాదం..

## 15 మంది నవజాత శిశువులు మృతి

### నియోనాటల్ వార్డులో చెలరేగిన మంటలు.. ఒక్క శిశువును మాత్రమే రక్షించిన సిబ్బంది




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఇస్లామాబాద్, ఆగస్టు 26:** పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రి పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో బుధవారం ఉదయం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆసుపత్రిలోని తల్లి-శిశు సంరక్షణ విభాగానికి చెందిన నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.ఉదయం సుమారు 7 గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ లేదా ఎయిర్ కండిషనర్‌లో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగా మంటలు చెలరేగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. మంటలతో పాటు దట్టమైన పొగ వ్యాపించడంతో వార్డులో చికిత్స పొందుతున్న నవజాత శిశువులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.ప్రమాదం జరిగిన సమయంలో వార్డులో మొత్తం 16 మంది శిశువులు ఉన్నట్లు సమాచారం. వారిలో ఒక్కరిని మాత్రమే ఆసుపత్రి సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకురాగలిగారు. మిగిలిన 15 మంది శిశువులు మంటలు, పొగ కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక, సహాయక బృందాలు వెంటనే ఆసుపత్రికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయి. పుట్టిన కొద్ది రోజులకే పసికందులు ప్రాణాలు కోల్పోవడంతో వారి తల్లిదండ్రులు, బంధువుల రోదనలతో ఆసుపత్రి ప్రాంగణం విషాదంగా మారింది.ఈ ఘటనపై ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదానికి అసలు కారణాలను నిర్ధారించేందుకు ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించినట్లు సమాచారం. విచారణ అనంతరం ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# మృతుని కుటుంబానికి అండగా విద్యుత్ శాఖ

### రూ. 63,500 ఆర్థిక సహాయం



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 26, నర్సింహులపేట** మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి ఆసరాగా నిలిచి విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది మానవీయ ధోరణిని చాటుకున్నారు.నర్సింహులపేట మండలం ముంగిమడుగు విద్యుత్ కేంద్రం పరిధిలోని నరసింహాపురం బంజర శివారు పత్ని తండాకు చెందిన గూగులోతు నాగేశ్వరరావు ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఆయన గత కొన్నేళ్లుగా విద్యుత్ శాఖలో శాశ్వతేతర ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి అండగా నిలిచిన విద్యుత్ శాఖ సిబ్బంది, ఇతర ఉద్యోగులు కలిసి బుధవారం రూ. 63,500 నగదు సహాయాన్ని సమకూర్చారు. ఈ మొత్తాన్ని జిల్లా విద్యుత్ అధికారి ఎం. శ్రీనివాస్, విద్యుత్ అధికారి పాండు నాయక్ చేతుల మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి భవిష్య నిధి, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సహాయ అధికారి హరీష్, గుగులోతు మాలు, మల్సూర్, కిషన్, ఉప్పలయ్య, సుధాకర్, శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# పెండింగ్ ప్రాజెక్టుల పరిష్కారం కొరకు చేపట్టిన పాదయాత్రను జయప్రదం చేయండి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల సమస్యల పరిష్కారం కొరకు జరుగుతున్న పాదయాత్ర జయప్రదం చేయలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు కోరారు బుధవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల సమస్యలు పరిష్కరించాలని జరిగే పాదయాత్ర జయప్రదం చేయాలని వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ... జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు బడ్జెట్ కేటాయించి పూర్తి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా ఉందని అధికారంలోకి వచ్చే ముందు రాష్ట్రంలో జిల్లాలో ఉన్న ప్రాజెక్టుల్లో కాలువలు పూర్తిచేసి రైతులకు సాగు త్రాగు నీరు అందిస్తామని చెప్పిన నేటికీ పూర్తి చేయలేదని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉన్నదని పరిష్కరించాలని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సాగు త్రాగునీరు అందించే విధంగా రాష్ట్రంలో జిల్లాలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులు కాలువను పూర్తి చేస్తామని మాటలు చెప్పిన ఆత్మకూరు మండలంలో సంవత్సర తరబడిగా బునాదిగాని కాలువ పెండింగ్లో ఉన్నదని సిపిఎం పార్టీ ఆందోళన పోరాటాలు చేసిన సందర్భంలో ఎన్నో కొన్ని నిధులు ఇస్తూ పనులు అవుతున్నాయి అన్నట్టుగా ప్రభుత్వం చేస్తున్నదని చిత్తశుద్ధితో బడ్జెట్ కేటాయించి రైతుల సంక్షేమం కోసం ఆలోచన చేసి వెంటనే పూర్తి చేయవలసిన అవసరం ఉన్నదని పెండింగ్ ప్రాజెక్టుల సాధనకై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 29 30 31 తేదీల్లో జరుగుతున్న పాదయాత్రను జయప్రదం చేయాలని అదేవిధంగా తేదీ 31హైదరాబాదులో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వేముల భిక్షం, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు రచ్చ గోవర్ధన్, మండల నాయకులు తుమ్మల సత్యనారాయణ రెడ్డి, మల్లెల శ్రీశైలం, వెంకటరెడ్డి నరసింహ, కేశవులు, సత్తయ్య, రాములు, యాదయ్య, రాజు, ఎల్లయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు

# లక్ష ఇంజెక్షన్‌లో నీళ్లే – నకిలీ క్యాన్సర్ మందుల గుట్టు రట్టు




**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 26, సెంట్రల్ డెస్క్ :** క్యాన్సర్ బాధితుల ప్రాణాలతో ఆడుకునే దారుణ మోసాన్ని ఢిల్లీ నేర విభాగం ఆగస్టు 20న చేసిన మెరుపు దాడుల్లో ఛేదించింది. మార్కెట్లో రూ.లక్ష వరకు అమ్ముడవుతున్న 'అవెలుమాబ్' క్యాన్సర్ ఇంజెక్షన్లలో మందు కాకుండా కేవలం నీటిని నింపి విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. జర్మనీకి చెందిన ప్రముఖ ప్రయోగశాల పరీక్షల్లో ఈ ఇంజెక్షన్లలో క్యాన్సర్ కణాలను ఎదుర్కొనే ఎలాంటి మందు పదార్థం లేదని నిర్ధారణ అయింది.రాజస్థాన్ ప్రభుత్వం ఉచితంగా అందించాల్సిన మందులను కూడా దొంగిలించి బయట అమ్ముతున్నట్లు కూడా వెల్లడైంది. ఈ అక్రమ వ్యాపారం ఢిల్లీ-ఎన్సీఆర్, ముంబై, హైదరాబాద్, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌తో సహా ఏడు రాష్ట్రాలకు విస్తరించి ఉంది.ఇప్పటివరకు 17 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సోదాల్లో 588 నకిలీ ఇంజెక్షన్ సీసాలు, ఖాళీ సీసాలు, 3,021 రకాల ఇతర మందులు, రూ.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. డార్జాలెక్స్, ఇమ్ఫింజి, ఎర్బిటక్స్, ఓప్డైటా, కీట్రుడా వంటి ఖరీదైన క్యాన్సర్ మందుల పేరిట ఈ మోసం జరిగింది.ఈ ముఠాకు మూడు మార్గాల ద్వారా మందులు అందేవి - అక్రమ మార్గాల్లో కొనుగోలు, ఆసుపత్రుల్లో రోగుల కోసం వచ్చిన మందులను అక్రమంగా స్వాధీనం చేసుకోవడం, ప్రభుత్వ గిడ్డంగుల నుంచి మందులను తరలించడం. వీటికి ఎలాంటి బిల్లులు, రికార్డులు, అనుమతులు లేకుండా ఇళ్లలో ఇతర చోట్ల నిల్వ చేసేవారు. ఆ తర్వాత మధ్యవర్తుల ద్వారా విక్రయించేవారు.ఉపయోగించిన అసలు సీసాలు, ప్యాకింగ్ పెట్టెలను రసాయనాలతో శుభ్రపరిచి, పాత వివరాలను తొలగించి, కొత్త కవర్లు, బుడగలతో మరలా ప్యాక్ చేసి అసలు మందులుగా మార్కెట్లోకి వదిలేవారు.ఈ దందాలో లక్ష్మీనగర్కు చెందిన అభిషేక్ వైష్, శుభం కుమార్ చౌదరి, సూరజ్ చౌదరి కీలక పాత్రధారులు. అభిషేక్ 2022 నుంచే ఈ అక్రమ వ్యాపారం చేస్తున్నాడు. నోయిడా, గురుగ్రామ్, ఫరీదాబాద్, హైదరాబాద్లకు చెందిన మందుల సరఫరాదారులు, ఆసుపత్రి సిబ్బంది కూడా ఈ కుట్రలో భాగమని విచారణలో తేలింది.ప్రస్తుతం నేర విభాగం కేసు నమోదు చేసి, క్యాన్సర్ బాధితుల ప్రాణాలతో ఆడుకున్న ఈ ముఠా మూలాలను కనుగొనేందుకు దర్యాప్తు కొనసాగిస్తోంది.

# మచ్చ బొల్లారంలో ఘనంగా మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు

## మహమ్మద్ జావీద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు.. వేడుకల్లో పాల్గొన్న పలువురు నాయకులు

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 26, మచ్చ బొల్లారం:** అల్వాల్ సర్కిల్ పరిధిలోని మచ్చ బొల్లారంలో మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ మైనారిటీ నాయకుడు మహమ్మద్ జావీద్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.కార్యక్రమానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కల్వకుంట్ల వంశీధర్ రావు, నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డోలి రమేష్, అతిక్, సాజిద్, హైమద్, ఫరీద్, ఫిరోజ్, రషీద్, దిలీహర్, ఆసిఫ్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.ఉద్యమకారులు మంద శోభన్ బాబు, మహేష్ చెలిమెల, సురేందర్ రెడ్డి, నర్ల సురేష్, టీఆర్ఎస్ నాయకులు భాస్కర్ రెడ్డి, ఉమేష్ తదితరులు వేడుకల్లో పాల్గొని తమ మద్దతు తెలిపారు.

**శాంతి, సోదరభావాన్ని పెంపొందించాలి**







ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, దయ, కరుణ, సమానత్వం, మానవత్వం వంటి విలువలు సమాజానికి ఆదర్శప్రాయమని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ సోదరభావంతో మెలగాలని, మత సామరస్యాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.


**ఘనంగా అన్నదాన కార్యక్రమం**

జన్మదిన వేడుకలను పురస్కరించుకుని నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేడుకలకు హాజరైన ముస్లిం సోదరులు, స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు అన్నదానం చేశారు. సేవాభావంతో నిర్వహించిన కార్యక్రమాన్ని పలువురు అభినందించారు.అలాగే మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర, బోధనలు, మానవాళికి అందించిన సందేశాలను స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శాంతి, సౌభ్రాతృత్వం, మానవత్వం వర్ధిల్లాలని ప్రార్థించారు.మచ్చ బొల్లారంలో జరిగిన వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# మేరు కొట్టు పారిశ్రామిక సంఘం ఉపాధ్యక్షుడు గట్ల భిక్షపతి మృతి

## సుదీర్ఘకాలం సంఘానికి సేవలు.. మాడిశెట్టి శ్రీనివాస్ తదితరుల నివాళి

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 26, సికింద్రాబాద్:** సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సెకండ్ బజార్‌కు చెందిన మేరు కొట్టు పారిశ్రామిక సంఘం సీనియర్ ఉపాధ్యక్షుడు గట్ల భిక్షపతి బుధవారం ఉదయం అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సంఘంలో సుదీర్ఘకాలం సేవలందించిన భిక్షపతి పలువురికి అండగా నిలిచారని సంఘ సభ్యులు తెలిపారు. అలాగే గత 30 సంవత్సరాలుగా అయ్యప్ప మాల ధరిస్తూ గురుస్వామిగా కొనసాగుతున్న ఆయన పలువురికి ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అందించారని పేర్కొన్నారు.భిక్షపతి మృతికి మేరు కొట్టు పారిశ్రామిక సంఘం కమిటీ సభ్యులు, కాలనీవాసులు సంతాపం వ్యక్తం చేశారు. మాడిశెట్టి శ్రీనివాస్, కీర్తి కనకయ్య, రాయి లచ్చన్న, కీర్తి అంజనేయులు, మధు కృష్ణ, కీర్తి శ్రీనివాస్, కీర్తి సత్యనారాయణ, రాయి లడ్డు తదితరులు భిక్షపతి భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.




# నేడు భువనగిరి జిల్లాకు టీఆర్పి అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

### జెంజి యువతతో ప్రత్యేక సమావేశం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 26, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి, యువతలో చైతన్యం, నాయకత్వ లక్షణాలు మరియు సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు నిర్వహిస్తున్న “జెన్ జెడ్ అడ్డా విత్ మల్లన్న” కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు.గురువారం ఉదయం 11:00 గంటలకు భువనగిరిలోని ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో యువతతో ముఖాముఖి సంభాషణ, వారి సందేహాలకు సమాధానాలు, భవిష్యత్ అవకాశాలపై మార్గనిర్దేశం చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు “యాంగ్ మైండ్స్, బోల్డ్ ఐడియాస్, మీనింగ్ ఫుల్ కన్వర్జేషన్ ” అనే నినాదంతో



నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో యువత తమ ప్రశ్నలను నేరుగా అడిగి సమాధానాలు తెలుసుకునే అవకాశం కల్పించబడుతుంది. అలాగే తమలోని ప్రతిభను గుర్తించి, సమాజ మార్పులో భాగస్వాములు కావాలని యువతను ప్రోత్సహించనున్న మల్లన్న యువత పాత్ర, విద్య, ఉపాధి, నాయకత్వం, సామాజిక బాధ్యత వంటి అంశాలపై ప్రత్యేకంగా మల్లన్న మాట్లాడనున్నారుఈ కార్యక్రమానికి విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మల్లన్న కోరారు.

# తాడ్‌బంద్‌లో ఘనంగా ఈద్ మిలాద్-ఉన్-నబీ వేడుకలు

## వేడుకల్లో పాల్గొన్న భానుక నర్మదా మల్లికార్జున్.. చిన్నారులకు బిస్కెట్లు, టిఫిన్ బాక్సుల పంపిణీ





**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 26, తాడ్‌బంద్:** శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ఈద్ మిలాద్-ఉన్-నబీ వేడుకలను సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 6వ వార్డు తాడ్‌బంద్ ప్రాంతంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు వేర్వేరు ప్రాంతాల్లో చిన్నారులకు బిస్కెట్లు, టిఫిన్ బాక్సులను పంపిణీ చేశారు.ఈద్ మిలాద్-ఉన్-నబీ పర్వదినం సందర్భంగా ప్రజలంతా సుఖసంతోషాలతో, ఐకమత్యంతో జీవించాలని భానుక నర్మదా మల్లికార్జున్ ఆకాంక్షించారు. శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవం సమాజంలో మరింత బలపడాలని కోరారు.ఈ కార్యక్రమంలో 6వ వార్డు మైనార్టీ విభాగం అధ్యక్షుడు దావూద్, సలీం, అన్నూభాయ్, స్థానిక మసీదు కమిటీ చైర్మన్ అజీజ్, అబిద్, డాక్టర్ రషీద్, జాకీర్‌తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్జికల్ స్ట్రైక్–59 తో రెడ్లు, వెలమల రాజకీయానికి చెక్

### “2028లో సామాజిక మార్పు ఖాయం”

### టిఆర్పి పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 26, తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్, తెలంగాణలో బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ చేపట్టిన “సర్జికల్ స్ట్రైక్–59” రాజకీయ ఆపరేషన్ రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారుతోంది. రాష్ట్రంలోని 59 నియోజకవర్గాల్లో రెడ్డి, వెలమ, కమ్మ సామాజిక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేల ప్రాతినిధ్యంపై గణాంక ఆధారిత విశ్లేషణ చేపట్టిన పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వరంగల్ వెస్ట్, పరకాల, పాలేరు నియోజకవర్గాల ఓటర్ల వివరాలను అధికారిక లెక్కలతో ప్రజల ముందుంచారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, “ప్రజాస్వామ్యంలో మెజారిటీ ప్రజల చేతుల్లోనే రాజ్యాధికారం ఉండాలి. బీసీలు ఓట్ల రూపంలో మెజారిటీగా ఉన్నప్పటికీ అధికారంలో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. ఈ అసమానతలను ప్రజలకు తెలియజేయడమే సర్జికల్ స్ట్రైక్–59 లక్ష్యం” అని మల్లన్న పేర్కొన్నారు.

**వరంగల్ వెస్ట్‌లో రెడ్డి ఓట్లు 16,009 మాత్రమే – బీసీ ఓట్లు 1.78 లక్షలు**

హనుమకొండ జిల్లా పరిధిలోని వరంగల్ వెస్ట్ నియోజకవర్గంలో మొత్తం 2,86,757 ఓట్లు ఉండగా, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఓట్లు కేవలం 16,009 మాత్రమే ఉన్నాయని మల్లన్న వెల్లడించారు. అదే సమయంలో బీసీ ఓటర్లు 1,78,239 మంది ఉండడం విశేషమన్నారు. రెడ్డి ఓటర్లతో పోలిస్తే బీసీ ఓటర్లు పదకొండు రెట్లు ఎక్కువగా ఉన్నారని వివరించారు.ఈ నియోజకవర్గంలో డాక్టర్ అభినవ్ భాస్కర్, దాస్యం వినయ్ భాస్కర్, ప్రొఫెసర్ తిరునహరి శేషు, సంగం రెడ్డి పృథ్వీరాజు, రావుల కిషన్, జక్కుల రవీందర్ వంటి బలమైన బీసీ నాయకత్వం అందుబాటులో ఉందని తెలిపారు.

**పరకాలలో 62 శాతం బీసీ ఓటర్లు**

ప్రస్తుతం రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పరకాల నియోజకవర్గంలో మొత్తం 2,21,590 ఓట్లు ఉండగా, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఓట్లు 12,371 మాత్రమేనని తెలిపారు. బీసీ ఓటర్లు 1,37,739 (62.16 శాతం) ఉండటం ద్వారా ఈ నియోజకవర్గ రాజకీయాలను బీసీ వర్గాలే నిర్ణయించే స్థితిలో ఉన్నాయని పేర్కొన్నారు.గతంలో ములుగూరు భిక్షపతి వంటి బీసీ నేతలు విజయాలు సాధించారని గుర్తుచేస్తూ, మాజీ ఎమ్మెల్యే ములుగూరు భిక్షపతి, పల్లబోయిన అశోక్ ముదిరాజ్, డాక్టర్ కాళీ ప్రసాద్, కొండా సుష్మిత, పూజారి సత్యనారాయణ, డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్, నాగుర్ల వెంకటేశ్వరులు, హవేలి దామోదర్ వంటి నాయకులు ప్రజా బలం కలిగిన బీసీ నేతలని తెలిపారు.

**పాలేరులో బీసీల మద్దతు లేకుండా గెలుపు అసాధ్యం**

ఖమ్మం జిల్లా పరిధిలోని పాలేరు నియోజకవర్గంలో మొత్తం 2,36,451 ఓట్లు ఉండగా, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఓట్లు 8,683 (3.67 శాతం) మాత్రమేనని మల్లన్న వెల్లడించారు. మరోవైపు బీసీ ఓటర్లు 1,09,746 (46.41 శాతం) ఉండటంతో బీసీల మద్దతు లేకుండా ఎవ్వరూ ఎమ్మెల్యేగా గెలవలేరని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు.ఈ నియోజకవర్గంలో వెన్నబోయిన



రమేష్ యాదవ్, పాశబోయిన వీరన్న ముదిరాజ్, పత్తి నాగేశ్వరరావు, వెన్నపూసల సీతారాములు యాదవ్, బొల్లికొండ శరత్ గౌడ్, గూడూరు ఉపేందర్, శీలం వెంకట లక్ష్మి, మామిడి వెంకన్న, ఎంకి జానకి రామయ్య యాదవ్, పాగర్తి సుధాకర్ వంటి బలమైన బీసీ నాయకులు ఉన్నారని తెలిపారు.

**“2028లో సామాజిక తెలంగాణకు బాటలు”**

తెలంగాణలో చాలా తక్కువ జనాభా కలిగిన రెడ్లు, వెలమలు చేతుల్లోనే రాజ్యాధికారం కేంద్రీకృతం కావడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని తీన్మార్ మల్లన్న వ్యాఖ్యానించారు. “2028 ఎన్నికల్లో సామాజిక మార్పు ఖాయం. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు కలిసి రాజకీయ ప్రత్యామ్నాయాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది” అని పిలుపునిచ్చారు.ఇప్పటికే రెడ్డి సామాజిక వర్గం ప్రాతినిధ్యం వహిస్తున్న 43 స్థానాల విశ్లేషణను ప్రజల ముందుకు తీసుకువస్తున్నామని, త్వరలోనే వెలమలు ప్రాతినిధ్యం వహిస్తున్న 13 స్థానాలు, కమ్మలు ప్రాతినిధ్యం వహిస్తున్న 3 స్థానాల గణాంకాలను కూడా బహిర్గతం చేస్తామని ప్రకటించారు.

# కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

## తాడ్‌బండ్, రసూల్‌పుర, బొల్లారం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

## విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్






**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 26, కంటోన్మెంట్:** మిలాద్-ఉన్-నబీ పవిత్ర పండుగను పురస్కరించుకుని కంటోన్మెంట్ నియోజకవర్గంలో నిర్వహించిన వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.తాడ్‌బండ్, రసూల్‌పురలోని మసీదులను సందర్శించిన ఎమ్మెల్యే అక్కడ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలు, వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, సమైక్యత మరింత వర్ధిల్లాలని ఆకాంక్షించారు.అనంతరం బొల్లారంలోని జామియా మసీదులో నిర్వహించిన మిలాద్-ఉన్-నబీ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ‘సీరత్-ఉన్-నబీ’ ప్రశ్నావళి పోటీలో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.విద్యార్థులు చదువుతో పాటు ఆధ్యాత్మిక, సామాజిక అంశాలపై కూడా అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, మసీదు కమిటీ ప్రతినిధులు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో మిలాద్-ఉన్-నబీ వేడుకలు


### ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 26, ఓల్డ్ బోయిన్‌పల్లి:** మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో నిర్వహించిన ఉర్సు ఉత్సవాల్లో మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, భక్తులను కలుసుకుని మిలాద్-ఉన్-నబీ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో సోదరభావం, శాంతి, ఐకమత్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో, సోదరభావంతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, కార్యదర్శి హరినాథ్, సలీం, అజీమ్, ఇబ్బు, వసీం, హరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డల వివాహానికి చేయూత

### నూతన వధూవరులకు ఆశీర్వాదం.. రూ.10 వేల ఆర్థిక సాయం అందించిన సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 26, జహీరాబాద్:**
హుగ్గెల్లీ గ్రామంలో ఆడబిడ్డల వివాహాలకు తన వంతు సహాయం అందిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.బుధవారం హుగ్గెల్లీ గ్రామానికి చెందిన బూతపిల్లి శంకరమ్మ--బక్కప్ప దంపతుల కుమార్తె వైష్ణవి (గాయత్రీ) వివాహ కార్యక్రమానికి సర్పంచ్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వధువు కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వధువు కుటుంబ సభ్యులు తమ కుమార్తె వివాహానికి ఆర్థిక సహాయం అందించిన సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాజు, వార్డు సభ్యులు బాల్ రాజు, సాల్మన్, సీనియర్ నాయకులు మునిందర్ రెడ్డి, నర్సింహులు, అశోక్, వెంకట్ స్వామి, అక్బర్, ప్రవీణ్ పాండు, లక్ష్మారెడ్డి, ప్రకాష్‌తో పాటు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రాయిపల్లిలో ఘనంగా గార్డెన్ దొర వర్ధంతి వేడుకలు

### పేదలు, వెనుకబడిన వర్గాల విద్యాభివృద్ధికి విశేష సేవలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్,రాయిపల్లి, ఆగస్టు 26:**
నారాయణఖేడ్ నియోజకవర్గంలోని రాయిపల్లి మెథడిస్ట్ చర్చిలో గార్డెన్ దొర వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.జహీరాబాద్ పట్టణంలోని ఎంఆర్‌హెచ్‌ఎస్ పాఠశాలలో 1947 నుంచి 1967 వరకు వ్యవస్థాపకుడిగా సేవలందించిన గార్డెన్ దొర.. వెనుకబడిన, పేద కుటుంబాల పిల్లలకు ఉచిత విద్య అందించడంతో పాటు ఉచితంగా దుస్తులు పంపిణీ చేసినట్లు కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ ఎంపీడీవో జాన్ తెలిపారు.జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో పర్యటిస్తూ పేదలకు వైద్య సేవలు అందించడంతో పాటు దుస్తులు పంపిణీ చేసి, ప్రజల సంక్షేమానికి కృషి చేశారని ఆయన గుర్తుచేశారు. రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ పంటల సాగు విధానాలపై సూచనలు ఇచ్చేవారని తెలిపారు.గార్డెన్ దొర సేవలను ఆదర్శంగా తీసుకుని సమాజంలోని పేదలకు విద్య, వైద్యం తదితర సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జాన్ పిలుపునిచ్చారు.గార్డెన్ దొర జ్ఞాపకార్థం పాస్టర్ పీటర్ ఆధ్వర్యంలో సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాయిపల్లి మెథడిస్ట్ చర్చి సంఘ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## దూలపల్లిలో ఎఫ్‌టీఎల్ భూముల్లో

# అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

### అనుమతులు లేకుండా నిర్మాణాలు, బోర్‌వెల్లుల ఏర్పాటు చేశారంటూ ఆరోపణలు

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 26, దూలపల్లి:**
దూలపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 124లో ఉన్న ఎఫ్‌టీఎల్ (పూర్తి నీటి మట్టం) భూముల్లో అక్రమ నిర్మాణాలు, అనధికార బోర్‌వెల్లుల ఏర్పాటుపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు.ప్రభుత్వ రిటైర్డ్ అధికారి వెంకట్ రామిరెడ్డి, వెంకటేశ్వర వెల్ఫేర్ అసోసియేషన్ ప్లాట్ యజమానుల తరఫున దూలపల్లి గ్రామానికి చెందిన పి.ఆర్. సాయిరాం తహసీల్దార్, కొంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదులో ఎఫ్‌టీఎల్ భూముల్లో అనుమతులు లేకుండా గదులు, ప్రహరీ గోడలు, భారీ గేట్లు నిర్మించడంతో పాటు రెండు బోర్‌వెల్లులు ఏర్పాటు చేసినట్లు ఆరోపించారు. ఈ నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, వాటివల్ల చెరువు నీటి ప్రవాహానికి ఆటంకం కలగడంతో పాటు ప్రజల భద్రతకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**క్షేత్రస్థాయి పరిశీలనకు విజ్ఞప్తి**
సర్వే నంబర్ 124లో అధికారులు తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి అక్రమ నిర్మాణాలు, అనధికార బోర్‌వెల్లులను గుర్తించాలని ఫిర్యాదుదారులు కోరారు. అక్రమంగా నిర్మించిన గదులు, ప్రహరీ గోడలు, గేట్లను తొలగించి, రెండు బోర్‌వెల్లులను మూసివేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఎఫ్‌టీఎల్ భూముల పరిరక్షణకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరారు.



## హెచ్‌ఐవీ నివారణకు కొత్త ఇంజెక్షన్..

# భారత్‌లో త్వరలో అందుబాటులోకి!

### లేనాకాపవిర్‌పై కీలక ముందడుగు.. దేశీయంగా తయారీ, విక్రయాలకు అనుమతుల దిశగా అడుగులు

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 26, సెంట్రల్ డెస్క్:**
హెచ్‌ఐవీ వ్యాప్తిని నివారించే దిశగా భారతదేశంలో కీలక ముందడుగు పడింది. హెచ్‌ఐవీ సోకకుండా ముందస్తు రక్షణ కోసం ఉపయోగించే 'లేనాకాపవిర్' ఇంజెక్షన్‌ను దేశీయంగా తయారు చేసి విక్రయించేందుకు ప్రముఖ ఔషధ సంస్థలు డాక్టర్ రెడ్డీస్, ఎమ్‌క్యూర్‌కు మార్గం సుగమమైనట్లు సమాచారం.కేంద్ర నిపుణుల కమిటీ భారత్‌లో నిర్వహించాల్సిన కొన్ని స్థానిక వైద్య పరీక్షల నుంచి మినహాయింపు ఇచ్చే ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. హెచ్‌ఐవీ ముప్పు ఎక్కువగా ఉన్న పెద్దలు, కౌమారదశలోని వారికి వైరస్ సోకకుండా రక్షణ కల్పించడంలో ఈ ఇంజెక్షన్ ఉపయోగపడుతుందని నిపుణులు భావిస్తున్నారు.

**పలు దేశాల్లో ఇప్పటికే అనుమతి**
అమెరికా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్, కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో లేనాకాపవిర్‌కు ఇప్పటికే అనుమతులు లభించినట్లు సమాచారం. భారతదేశంలోనూ దీని అవసరాన్ని పరిగణనలోకి తీసుకుని వేగంగా అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు జరుగుతున్నాయి.ఎమ్‌క్యూర్ సంస్థ కూడా ఇంజెక్షన్ తయారీ, విక్రయాలకు అనుమతి కోరింది. హెచ్‌ఐవీ నివారణతో పాటు ఇప్పటికే తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ ఉన్న రోగుల చికిత్సలో ఉపయోగించేందుకు కూడా అనుమతి కోరినప్పటికీ, వ్యాధి ముదిరిన రోగులపై దీని ప్రభావానికి సంబంధించి మరింత సమాచారం అవసరమని నిపుణుల కమిటీ పేర్కొన్నట్లు సమాచారం.

**మార్కెట్లోకి వచ్చిన తర్వాత కూడా పర్యవేక్షణ**
అనుమతులు లభించిన తర్వాత కూడా ఔషధ భద్రత, పనితీరుపై నిఘా కొనసాగనుంది. మార్కెటింగ్ అనుమతి పొందిన మూడు నెలల్లోపు నాలుగో దశ వైద్య అధ్యయనాల ప్రణాళికను సంబంధిత సంస్థలు ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుందని సమాచారం.

**రోజువారీ మాత్రలకు ప్రత్యామ్నాయంగా?**
లేనాకాపవిర్ అందుబాటులోకి వస్తే హెచ్‌ఐవీ నివారణ




కోసం ప్రతిరోజూ మాత్రలు తీసుకోవాల్సిన అవసరం కొంతవరకు తగ్గే అవకాశం ఉంది. కనీసం 35 కిలోల బరువు ఉండి, రక్త పరీక్షలో హెచ్‌ఐవీ నెగెటివ్‌గా నిర్ధారణ అయిన వారికి మాత్రమే ఈ ఇంజెక్షన్ ఉపయోగించనున్నట్లు సమాచారం.హెచ్‌ఐవీ నివారణ చర్యల్లో ఈ ఇంజెక్షన్ అందుబాటులోకి రావడం కీలక ముందడుగుగా నిపుణులు భావిస్తున్నారు. అయితే దీనిని వైద్యుల సూచన, పరీక్షలు, అధికారిక మార్గదర్శకాల ప్రకారం మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుంది.

## భారత్ ధర్మసత్రం కాదు..చొరబాటుదారులకు చోటు లేదు: అమిత్ షా

### అక్రమ వలసలతో దేశ భద్రత, ఆర్థిక స్థిరత్వానికి ముప్పు.. సరిహద్దుల రక్షణకు అత్యంత ప్రాధాన్యం

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 26, సెంట్రల్ డెస్క్:**
భారత్‌లో నివసించే హక్కు దేశ పౌరులకే ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. అక్రమంగా దేశంలోకి ప్రవేశించే వారికి ఆశ్రయం కల్పించేందుకు భారత్ ధర్మసత్రం కాదని పేర్కొన్నారు. అక్రమ వలసల కారణంగా దేశ భద్రత, ఆర్థిక స్థిరత్వం, జనాభా సమతుల్యతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని అన్నారు.నార్కోటిక్స్ అక్రమ రవాణా, అక్రమ చొరబాట్లు, ఉగ్రవాదం వంటి కొత్త భద్రతా సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు భద్రతా సంస్థలు మరింత అప్రమత్తంగా, కఠినంగా వ్యవహరించాలని అమిత్ షా సూచించారు. దేశ



అంతర్గత భద్రతను కాపాడేందుకు సంబంధిత సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**సరిహద్దుల భద్రతకు ప్రాధాన్యం**
అక్రమ వలసలను అరికట్టడంతో పాటు దేశ సరిహద్దుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర హోంమంత్రి స్పష్టం చేశారు. మారుతున్న భద్రతా పరిస్థితులకు అనుగుణంగా భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**కొత్త క్రిమినల్ చట్టాలపై దృష్టి**
వచ్చే ఏడాదిలోగా మూడు కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకురానున్నట్లు అమిత్ షా తెలిపారు. నేరాలను మరింత సమర్థంగా ఎదుర్కొనేలా న్యాయ, భద్రతా వ్యవస్థల్లో అవసరమైన మార్పులు తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు.దేశ భద్రతకు ఎదురవుతున్న కొత్త సవాళ్లను గుర్తించి, వాటిని ఎదుర్కొనే సామర్థ్యాన్ని భద్రతా వ్యవస్థలు నిరంతరం పెంచుకోవాలని ఆయన సూచించారు.

## సెల్‌ఫోన్ చోరీతో బ్యాంకు ఖాతాలు ఖాళీ

### హైదరాబాద్‌లో సరికొత్త సైబర్ మోసం.. వృద్ధులే లక్ష్యంగా చోరీలు

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 26, హైదరాబాద్ :**
సెల్‌ఫోన్లను చోరీ చేసి, వాటి ద్వారా బ్యాంకు ఖాతాల్లోని నగదును కాజేస్తున్న సైబర్ ముఠా వ్యవహారం హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చింది. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో ముఖ్యంగా వృద్ధులను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠా చోరీలకు పాల్పడుతున్నట్లు సమాచారం.

**ముందే అన్‌లాక్ విధానంపై నిఘా**
ఫోన్ చోరీ చేయడానికి ముందే బాధితులు తమ సెల్‌ఫోన్‌ను అన్‌లాక్ చేసే విధానాన్ని ముఠా సభ్యులు గమనిస్తున్నట్లు తెలుస్తోంది. పిన్, ప్యాటర్న్, పాస్‌వర్డ్ వంటి వివరాలను గుర్తుంచుకుని, సరైన సమయం చూసి ఫోన్‌ను చోరీ చేస్తున్నట్లు సమాచారం.ఫోన్ చేతికి చిక్కిన తర్వాత దాన్ని అన్‌లాక్ చేసి అందులోని యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్ సదుపాయాలను ఉపయోగించి బ్యాంకు ఖాతాల నుంచి నగదును బదిలీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫోన్‌తో పాటు దాని అన్‌లాక్




వివరాలు కూడా నేరగాళ్లకు లభించడంతో ఈ తరహా మోసాన్ని పోలీసులు 'హైబ్రిడ్ మోసం'గా గుర్తిస్తున్నట్లు సమాచారం.

**అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన**
రద్దీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్ ఉపయోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇతరులు గమనించే విధంగా పిన్, ప్యాటర్న్, పాస్‌వర్డ్ నమోదు చేయవద్దని హెచ్చరిస్తున్నారు.సెల్‌ఫోన్ చోరీకి గురైతే ఆలస్యం చేయకుండా బ్యాంకు ఖాతాలు, యూపీఐ సేవలను నిలిపివేయడంతో పాటు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. మొబైల్‌లో బ్యాంకింగ్ సేవలను ఉపయోగించే వారు అదనపు భద్రతా చర్యలు పాటించాలని పోలీసులు కోరుతున్నారు.

# గుజరాత్-తెలంగాణ అభివృద్ధి నమూనాలు..
# రాజకీయ విమర్శల మధ్య పెరుగుతున్న చర్చ

**భారీ పరిశ్రమల్లో గుజరాత్.. ఐటీ, ఔషధ, జీవశాస్త్ర రంగాల్లో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 26, సెంట్రల్ బ్యూరో:**
గుజరాత్, తెలంగాణ రాష్ట్రాల అభివృద్ధి నమూనాలపై రాజకీయ వర్గాల్లో, ఆర్థిక రంగంలో కొత్త చర్చ మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలకు సంబంధించిన అనుమతుల అంశంపై కేంద్రంతో నెలకొన్న వివాదం నేపథ్యంలో రెండు రాష్ట్రాల పారిశ్రామిక, పెట్టుబడి విధానాలను పోల్చుతూ రాజకీయ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే గుజరాత్, తెలంగాణ రెండూ వేర్వేరు రంగాల్లో తమకంటూ ప్రత్యేక బలాలను అభివృద్ధి చేసుకున్నాయి. గుజరాత్ భారీ తయారీ పరిశ్రమలు, పెట్రోరసాయనాలు, ఆటోమొబైల్, ఎగుమతులు, ఆర్థిక సేవల రంగాల్లో బలంగా ఉంటే.. తెలంగాణ హైదరాబాద్ కేంద్రంగా సమాచార సాంకేతికత, ఔషధాలు, జీవశాస్త్రం, పరిశోధన, కృత్రిమ మేధ వంటి రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది.

**గుజరాత్.. భారీ పరిశ్రమలకు కేంద్రం**

గుజరాత్ దశాబ్దాలుగా అభివృద్ధి చేసిన పారిశ్రామిక మౌలిక వసతులు ఆ రాష్ట్రానికి ప్రధాన బలంగా నిలుస్తున్నాయి. ఓడరేవులు, పారిశ్రామిక కారిడార్లు, తయారీ రంగం, పెట్రోరసాయన పరిశ్రమలతో పాటు గిఫ్ట్ సిటీ ద్వారా అంతర్జాతీయ ఆర్థిక సేవల రంగాన్ని విస్తరించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ వంటి రంగాల్లోనూ భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాలను అమలు చేస్తోంది.

**తెలంగాణకు ఐటీ, ఔషధ రంగాల అండ**




తెలంగాణ అభివృద్ధిలో హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తోంది. సమాచార సాంకేతికతతో పాటు ఔషధాలు, జీవశాస్త్రం, వైద్య పరిశోధన, టీకాల తయారీ రంగాల్లో హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. భవిష్యత్ నగరం, కృత్రిమ మేధ, జీవశాస్త్రం, ఆధునిక పరిశోధన రంగాలను మరింత విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ప్రపంచ స్థాయి విద్యా సంస్థలు, పరిశోధనా సంస్థలతో భాగస్వామ్యాలను పెంచడం ద్వారా నైపుణ్యమున్న మానవ వనరులను తయారు చేయడంపై కూడా దృష్టి సారిస్తోంది.

**పెట్టుబడుల కోసం పోటీ**

దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో రెండు రాష్ట్రాల మధ్య పోటీ నెలకొంది. గుజరాత్ భారీ తయారీ ప్రాజెక్టులు, సెమీకండక్టర్ పరిశ్రమలు, ఆర్థిక సేవల రంగాన్ని ముందుకు తీసుకెళ్తుండగా.. తెలంగాణ ఐటీ, ఔషధాలు, జీవశాస్త్రం, కృత్రిమ మేధ ఆధారిత పరిశ్రమలపై ఎక్కువగా దృష్టి పెడుతోంది. దీంతో రెండు రాష్ట్రాలు ఒకే అభివృద్ధి నమూనాను అనుసరిస్తున్నాయని చెప్పడం కంటే.. తమకు ఉన్న మౌలిక వసతులు, నైపుణ్యాలు, వనరులకు అనుగుణంగా వేర్వేరు రంగాల్లో ముందుకు సాగుతున్నాయని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**రాజకీయ వివాదం నుంచి అభివృద్ధి చర్చ వరకు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలకు సంబంధించిన అనుమతుల వ్యవహారం ఈ రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ పోలికలకు కారణమైంది. తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శిస్తుండగా.. కేంద్రం మాత్రం నిబంధనల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయని స్పష్టం చేస్తోంది. ఈ రాజకీయ వివాదం క్రమంగా గుజరాత్, తెలంగాణ అభివృద్ధి విధానాలపై చర్చకు దారితీసింది.

**పోటీ కంటే సహకారం ముఖ్యం**

దేశ ఆర్థికాభివృద్ధికి రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ అవసరమే అయినప్పటికీ.. ప్రాంతీయ రాజకీయ విభేదాలు పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలపై ప్రభావం చూపకుండా చూడాల్సిన అవసరం ఉంది. గుజరాత్ భారీ పరిశ్రమల్లో, తెలంగాణ ఐటీ – ఔషధ – జీవశాస్త్ర రంగాల్లో సాధించిన పురోగతిని పరస్పర అనుభవాలుగా తీసుకుంటే దేశానికే ప్రయోజనం కలుగుతుంది. రాష్ట్రాల బలాలకు అనుగుణంగా కేంద్రం సమాన అవకాశాలు కల్పించడం, మౌలిక వసతులు మరియు పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమవుతుంది. అభివృద్ధి ఏ ఒక్క రాష్ట్రానికో, ఏ ఒక్క రాజకీయ పార్టీకి పరిమితం కాదు. రాష్ట్రాల మధ్య పోటీ ఆరోగ్యకరంగా కొనసాగుతూ.. దేశ ఆర్థిక ప్రగతికి దోహదపడినప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం మరింత బలపడుతుంది.

# ఎలక్ట్రిక్ వాహనాలకు కేంద్రం భారీ ప్రోత్సాహం..
# ఏ వాహనానికి ఎంత రాయితీ?

**పీఎం ఈ-డ్రైవ్ పథకానికి రూ.10,900 కోట్లు..**

**ద్విచక్ర, త్రిచక్ర వాహనాల నుంచి బస్సులు, ట్రక్కుల వరకు ప్రోత్సాహకాలు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్,న్యూఢిల్లీ, ఆగస్టు 26:**
దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచడంతో పాటు కాలుష్యాన్ని తగ్గించడం, దేశీయ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ రంగాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పీఎం ఈ-డ్రైవ్ పథకాన్ని అమలు చేస్తోంది. భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ పథకానికి మొత్తం రూ.10,900 కోట్లను కేటాయించారు. పథకం అమలు గడువును 2028 మార్చి వరకు పొడిగించారు. ఈ పథకం కింద ఎలక్ట్రిక్ ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, బస్సులు, అంబులెన్సులు, ట్రక్కులతో పాటు ఛార్జింగ్ మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారు.

ద్విచక్ర వాహనాలకు రూ.5 వేల వరకు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అర్హత కలిగిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు కిలోవాట్ గంటకు రూ.2,500 చొప్పున ప్రోత్సాహకం లభిస్తుంది. ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.5 వేల వరకు రాయితీ ఉంటుంది. అయితే వాహనం ఫ్యాక్టరీ ధర రూ.1.50 లక్షలకు మించకూడదు. ఈ ప్రోత్సాహకం వాహనం ఫ్యాక్టరీ ధరలో 15 శాతానికి మించకూడదనే నిబంధన కూడా ఉంది.

**త్రిచక్ర వాహనాలకు రూ.25 వేల వరకు**

ఎలక్ట్రిక్ రిక్షాలు, కార్టకు గరిష్ఠంగా రూ.12,500 వరకు ప్రోత్సాహకం లభిస్తుంది. వీటి ఫ్యాక్టరీ ధర రూ.2.50 లక్షలకు మించకూడదు. ఎల్5 కేటగిరీకి చెందిన ప్రయాణికుల, సరకు రవాణా ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాలకు గరిష్ఠంగా రూ.25 వేల వరకు ప్రోత్సాహకం అందుతుంది. వీటి ఫ్యాక్టరీ ధర రూ.5 లక్షలలోపు ఉండాలి.

**బస్సులకు రూ.50 లక్షల వరకు**

ఎలక్ట్రిక్ బస్సులకు కిలోవాట్ గంటకు గరిష్ఠంగా రూ.10 వేల వరకు ప్రోత్సాహకం అందుతుంది. బస్సు పొడవు, సీటింగ్ సామర్థ్యాన్ని బట్టి ఒక్కో బస్సుకు రూ.35 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు గరిష్ఠ పరిమితి ఉంటుంది. అయితే ఫ్యాక్టరీ ధర రూ.2 కోట్లకు మించని బస్సులకే ఈ ప్రోత్సాహకం వర్తిస్తుంది. రాష్ట్ర రవాణా సంస్థలు కొనుగోలు చేసే బస్సులకు ఈ పథకం ద్వారా మద్దతు అందుతుంది.

**ఎలక్ట్రిక్ ట్రక్కులకు భారీ రాయితీ**

సరకు రవాణా రంగంలో ఎలక్ట్రిక్ ట్రక్కుల వినియోగాన్ని పెంచేందుకు కూడా కేంద్రం




ప్రోత్సాహకాలు అందిస్తోంది. కిలోవాట్ గంటకు రూ.5 వేల చొప్పున రాయితీ లభిస్తుంది. అయితే ఈ మొత్తం వాహనం ఫ్యాక్టరీ ధరలో 10 శాతానికి మించకూడదు. పాత వాణిజ్య వాహనాన్ని స్క్రాప్ చేసినట్లు ధ్రువీకరించే చెల్లుబాటు అయ్యే ధ్రువపత్రం ఉండటం తప్పనిసరి. భారీ వాహనాల కేటగిరీని బట్టి గరిష్ఠ ప్రోత్సాహక పరిమితి రూ.2.70 లక్షల నుంచి రూ.9.60 లక్షల వరకు ఉంటుంది.

**ఛార్జింగ్ కేంద్రాల కోసం రూ.2 వేల కోట్లు**

దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ మౌలిక వసతులను విస్తరించేందుకు రూ.2 వేల కోట్లను కేటాయించారు. సుమారు 72,300 ప్రజా ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. నాలుగు చక్రాల వాహనాలు, బస్సులు, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు అవసరమైన ఛార్జింగ్ సదుపాయాలను ఇందులో భాగంగా అభివృద్ధి చేయనున్నారు.

**అంబులెన్సులకు రూ.500 కోట్లు**

ఎలక్ట్రిక్ అంబులెన్సుల కోసం ప్రత్యేకంగా రూ.500 కోట్లను కేటాయించారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండే అంబులెన్సులకు ఈ ప్రోత్సాహకం వర్తిస్తుంది.

**కొనుగోలుదారులకు నేరుగా నగదు కాదు**

పీఎం ఈ-డ్రైవ్ పథకంలో కొనుగోలుదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయరు. అర్హత కలిగిన వాహనాన్ని కొనుగోలు చేసే సమయంలోనే రాయితీ మొత్తాన్ని వాహనం ధర నుంచి తగ్గిస్తారు. కొనుగోలుదారుడి ఆధార్ ఆధారిత ముఖ ధ్రువీకరణతో ఈ-కేవైసీ పూర్తి చేసిన అనంతరం ప్రత్యేక డిజిటల్ ఈ-వోచర్ జారీ అవుతుంది. కొనుగోలుదారు డిజిటల్‌గా సంతకం చేసిన తర్వాత డీలర్ వాహన బిల్లులో రాయితీ మొత్తాన్ని తగ్గిస్తారు. అనంతరం వాహన తయారీ సంస్థ ఆ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం నుంచి తిరిగి పొందుతుంది.

**22 లక్షలకు పైగా వాహనాలకు ప్రయోజనం**

ఇప్పటివరకు ఈ ప్రోత్సాహక వ్యవస్థ కింద 22 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ వాహనాలకు మద్దతు లభించినట్లు కేంద్రం వెల్లడించింది. ఇందులో 19 లక్షలకు పైగా ద్విచక్ర వాహనాలు, సుమారు 3 లక్షల త్రిచక్ర వాహనాలు ఉన్నట్లు సమాచారం. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచడంతో పాటు దేశీయ తయారీని ప్రోత్సహించేందుకు దశలవారీ తయారీ విధానాన్ని కూడా పీఎం ఈ-డ్రైవ్‌లో అమలు చేస్తున్నారు. బ్యాటరీ ప్యాక్‌లు, విడిభాగాలు, ఇతర కీలక భాగాల దేశీయ తయారీని పెంచడం ద్వారా దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

# నేపాల్ వరదల వేళ భారత్ భారీ సాయం

**10 టన్నుల సహాయక సామగ్రి, అత్యవసర మందులు తరలింపు**





**హైదరాబాద్ పల్స్ న్యూస్,న్యూఢిల్లీ, ఆగస్టు 26:**
నేపాల్‌లో భారీ వరదల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో భారత్ మానవతా సాయం అందించింది. వరద సహాయక చర్యలకు అండగా నిలిచేందుకు 10 టన్నుల మానవతా, విపత్తు సహాయక సామగ్రి, అత్యవసర మందులను నేపాల్‌కు పంపినట్లు విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు జైశంకర్ సానుభూతి తెలిపారు. విపత్తు కారణంగా ప్రభావితమైన నేపాల్ ప్రజల పట్ల భారత్ ఆవేదన వ్యక్తం చేస్తోందన్నారు.

**సహాయక చర్యలకు అండగా..**

నేపాల్‌లో కొనసాగుతున్న సహాయక, పునరావాస చర్యలకు భారత ప్రభుత్వం పంపిన సామగ్రి, మందులు ఉపయోగపడనున్నాయి. విపత్తు సమయంలో నేపాల్ ప్రజలకు భారత్ అండగా ఉంటుందని జైశంకర్ స్పష్టం చేశారు. వరదల నుంచి నేపాల్ కోలుకునే వరకు అవసరమైన సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. పొరుగు దేశంతో ఉన్న స్నేహపూర్వక సంబంధాలను దృష్టిలో ఉంచుకుని అత్యవసర పరిస్థితుల్లో సహాయం అందించడం కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# పాక్ ఆధారిత నెట్‌వర్క్ అనుమానితుడు అరెస్ట్.. అసోంలో ఎస్‌టీఎఫ్ ఆపరేషన్

**ఎస్‌బీఎన్ కేసులో అరెస్టుల సంఖ్య నాలుగుకు..**

**వేరే ఘటనలో రూ.2.33 కోట్ల విలువైన హెరాయిన్ స్వాధీనం**




**హైదరాబాద్ పల్స్ న్యూస్,గువాహటి, ఆగస్టు 26:** పాకిస్థాన్‌కు చెందిన షాజాద్ బట్టి నెట్‌వర్క్(ఎస్‌బీఎన్)తో సంబంధాలు ఉన్నట్లు అనుమానిస్తున్న మరో వ్యక్తిని అసోం పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్‌టీఎఫ్), హైలాకండి జిల్లా పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఫజల్ ఇస్లాం బర్భుయాన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. హైలాకండి జిల్లాలోని రామ్‌నాథ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అతడిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఎస్‌బీఎన్ కేసు దర్యాప్తులో భాగంగా అతడు అరెస్టు నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడని పోలీసులు తెలిపారు. అతడి వద్ద నుంచి అనుమానాస్పద పత్రాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ అరెస్టుతో ఎస్‌బీఎన్ కేసులో ఇప్పటివరకు అరెస్టైన వారి సంఖ్య నాలుగుకు చేరింది. గతంలో ధుబ్రి, చిరాంగ్, బార్పేట జిల్లాల నుంచి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రవాద, దేశ వ్యతిరేక నెట్‌వర్క్‌లపై కొనసాగుతున్న చర్యల్లో భాగంగానే ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు అసోం పోలీసుల ప్రజా సంబంధాల అధికారి రాజీవ్ సైకియా తెలిపారు.

**రైల్వే స్టేషన్‌లో భారీగా మాదకద్రవ్యాలు**

మరో ఘటనలో గువాహటి రైల్వే స్టేషన్‌లో రైల్వే రక్షణ దళం(ఆర్‌పీఎఫ్), నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. కామ్రూప్ ఎక్స్‌ప్రెస్‌లో చేపట్టిన తనిఖీల్లో రూ.2.33 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రయాణికుల బ్యాగుల్లో దాచిన నాలుగు ప్యాకెట్లలో 1.168 కిలోల హెరాయిన్(బ్రౌన్ షుగర్)ను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో అజాబుర్ రెహ్మాన్(22), సహజహాన్ అలీ(18)లను అరెస్ట్ చేసి తదుపరి దర్యాప్తు చేపట్టారు. ఒకే రోజు అసోంలో చోటుచేసుకున్న ఈ రెండు ఘటనలు భద్రతా, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా సంస్థలు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్న తీరును వెల్లడిస్తున్నాయి.